# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 29 | విశాఖపట్నం | 30-10-2025 గురువారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 29 | VISAKHAPATNAM | 30-10-2025 THURSDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9849349934




# ఆంధ్రప్రదేశ్‌లో బీభత్సం సృష్టించిన
# మొంథా తుపాను

- ఏపీ తీరాన్ని దాటిన తీవ్ర తుపాను మొంథా
- పలు జిల్లాల్లో విధ్వంసం
- గాలుల బీభత్సానికి ఇద్దరు మృతి.. భారీగా ఆస్తి, పంట నష్టం
- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే, సమీక్ష
- కోనసీమలో 20 వేల ఎకరాల్లో వరి పంట ధ్వంసమైనట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి
- పునరావాస కేంద్రాల్లోని బాధితులకు ఆర్థిక సాయం, నిత్యావసరాల పంపిణీ
- సహాయక చర్యల్లో పాల్గొంటున్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు

(అమరావతి, పతాకం న్యూస్)

మొంథా తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్‌ను అతలాకుతలం చేసింది. బుధవారం తెల్లవారుజామున రాష్ట్ర తీరాన్ని దాటిన ఈ తుఫాను పెను విధ్వంసం సృష్టించింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, వేలాది ఇళ్లు, పంటలు, విద్యుత్ టవర్లు దెబ్బతిన్నాయి. తుపాను ధాటికి జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. భారీ గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కుండపోత వర్షాలకు వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో కోస్తా జిల్లాల్లోని అనేక గ్రామాలు, పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల రోడ్లపైకి వరద నీరు చేరడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి, నేలకొరిగిన చెట్లను, స్తంభాలను తొలగించే పనుల్లో నిమగ్నమయ్యాయి. ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. కాకినాడ, మచిలీపట్నం మధ్య నర్సాపురం సమీపంలో మొంథా తుపాను తీరాన్ని దాటినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఆ తర్వాత క్రమంగా బలహీనపడి తీవ్ర వాయుగుండంగా, ఆపై వాయుగుండంగా మారింది. ఇది వాయవ్య దిశగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనించి రాబోయే ఆరు గంటల్లో అల్పపీడనంగా బలహీనపడనుందని అధికారులు వెల్లడించారు. ఈ తుపాను కారణంగా కోస్తా జిల్లాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక్క కోనసీమ జిల్లాలోనే 20 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నదని వ్యవసాయ మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలో భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. బాపట్ల జిల్లాలో ఓ పుణ్యక్షేత్రం వద్ద వరద నీటిలో చిక్కుకున్న 20 మందిని పోలీసులు సురక్షితంగా కాపాడారు.

పల్నాడు జిల్లా తిమ్మాపురం వద్ద కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16)పైకి వరద నీరు చేరడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. కొండచరియలు విరిగిపడటంతో శ్రీశైలం ఘాట్ రోడ్డును అధికారులు మూసివేశారు. ప్రకాశం జిల్లా వెలిగొండ ప్రాజెక్టులోని రెండు టన్నెళ్లలోకి వరద నీరు చేరడంతో, అక్కడ పనిచేస్తున్న 200 మంది సిబ్బందిని సురక్షితంగా బయటకు తరలించారు. నంద్యాల జిల్లాలో కుందూ నది, మద్దిలేరు, చామ కాల్వ వాగులు పొంగిపొర్లుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు కోనసీమ జిల్లాలోని ఉడెలరేవులో పర్యటించి, తుపాను నష్టాన్ని పరిశీలించారు. అనంతరం ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. అంతకుముందు మంత్రులు, జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, సహాయక చర్యలపై కీలక సూచనలు చేశారు. గత నాలుగు, ఐదు రోజులుగా సమర్థంగా చర్యలు తీసు కోవడం వల్లే నష్టాన్ని తగ్గించగలిగామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, ప్రభుత్వం బాధితులను ఆదుకునేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న వారికి ఒక్కొక్కరికి రూ. 1,000 చొప్పున ఆర్థిక సాయం అందించనుంది. ఒక కుటుంబంలో ముగ్గురి కంటే ఎక్కువ సభ్యులుంటే గరిష్టంగా రూ. 3,000 అందిస్తారు.

## మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో
# చంద్రబాబు పర్యటన



**కోనసీమ, పతాకం న్యూస్:** ముందస్తు చర్యల వల్ల మొంథా తుపాను సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించగలిగామని మ్ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. తుపాను ప్రభావిత జిల్లాలపై సీఎం ఏరియల్ వ్యూ నిర్వహించారు. హెలికాప్టర్‌లో విహంగ వీక్షణం చేశారు. అనంతరం రోడ్డుమార్గంలో వెళ్లి అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలోని ఓడలరేవులో పునరావాస కేంద్రాన్ని పరిశీలించి తుపాను బాధితులను స్వయంగా పరామర్శించారు. 3 వేల రూపాయల చొప్పున పరిహారం, నిత్యావసరాలు అందించారు. అలానే మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల బియ్యం చొప్పు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ మొంథా తుపాను పెనువిపత్తు అని రాష్ట్రానికి తీవ్రమైన నష్టం జరిగిందని అన్నారు. గతంలో తుపానుల సమయంలో పనిచేసిన అనుభవం నాకుందని తెలిపారు. ఈ మొంథా తుపానుపై ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకున్నామని అందువల్ల ముందు జాగ్రత్తలు తీసుకుని ఎటువంటి ప్రాణనష్టం లేకుండా చూశామని అన్నారు. ఆస్తి నష్టం కూడా చాలావరకు తగ్గేలా చర్యలు తీసుకున్నామని కాని పలు జిల్లాల్లో వరి, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షం నమోదైందని అన్నారు. ఆస్తి నష్టంపై నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటామని అలానే కౌలురైతులకు పరిహారం అందిస్తామని వెల్లడించారు. తుపాను సమయంలో అధికారులు బాగా పనిచేశారని సీఎం చంద్రబాబు కొనియాడారు.

"ఇది పెనువిపత్తు రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగింది. గతంలో తుపానుల సమయంలో పనిచేసిన అనుభవం నాకుంది. మొంథా తుపానుపై ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం. ముందుజాగ్రత్తలు తీసుకుని ప్రాణనష్టం లేకుండా చూశాం. ఆస్తి నష్టం కూడా చాలావరకు తగ్గేలా చర్యలు తీసుకున్నాం. పలు జిల్లాల్లో వరి, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షం నమోదైంది. ఆస్తి నష్టంపై నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు తెలిపారు.

మొంథా తుఫాను బాధితులకు ఆర్థికసాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పునరావాస కేంద్రాలకు వచ్చిన బాధితులకు ఆర్థిక సాయం చేయాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఉత్తర్వులు వెలువరించింది. బాధితుడికి 1000 రూపాయల చొప్పున ఆర్థిక సాయం చేయాలని ప్రభత్వం ఆదేశించింది. కుటుంబంలో ముగ్గురు కంటే ఎక్కువ ఉన్నా గరిష్టంగా రూ. 3 వేలు సాయం అందివ్వాలని ఆదేశాల్లో తెలిపింది.

## కోనసీమ జిల్లాలో 20వేల ఎకరాల్లో వరి పంట నష్టం: అచ్చెన్నాయుడు



**అమలాపురం పతాకం న్యూస్:** మొంథా తుపాను తీవ్రత ఊహించినంతగా లేకపోయినప్పటికీ విద్యుత్తు సరఫరా, రాకపోకలకు ఇబ్బంది కలిగించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 20 వేల ఎకరాల్లో వరి పంట నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేసినట్టు చెప్పారు. బుధవారం అమలాపురం కలెక్టరేట్లో జిల్లాస్థాయి అధి కారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. ఈదురు గాలుల వల్ల కోనసీమ జిల్లావ్యాప్తంగా 300 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని, వాటి పునరుద్ధరణ పనులు దాదాపు పూర్తయ్యాయని, ప్రతి ఇంటికి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామన్నారు.

## సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించిన చిరంజీవి



2లో



## మరో 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి నారా లోకేశ్

2లో


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# అప్రజాస్వామికం!

తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టనున్నట్లు భారత ఎన్నికల సంఘం ఏకపక్షంగా ప్రకటించడం తీవ్ర అభ్యంతరకరం. ఎన్నికల ప్రక్రియకు రెండు నెలల ముందు హడావిడిగా బీహార్‌లో చేపట్టిన ఎస్‌ఐఆర్‌పై విమర్శలు వెల్లువెత్తడంతో అత్యున్నత న్యాయస్థానం విచారిస్తున్న ప్రస్తుత దశలో 51 కోట్ల మందిపైగా ఓటర్ల భవితవ్యాన్ని నిగ్గుతేల్చే ఎస్‌ఐఆర్‌ను హడావిడిగా చేపట్టడం ప్రజాస్వామ్యం పట్ల ధిక్కార ధోరణే. స్థానిక సంస్థలకు, రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఎస్‌ఐఆర్ చేపట్టవద్దని కేరళ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాన్ని సైతం పక్కనపెట్టడం ఇసి పారదర్శకతనే ప్రశ్నార్థకం చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఇంకా జారీ చేయలేదనడం అడ్డగోలుగా వ్యవహరించడమే. రాష్ట్రాల పట్ల, స్థానిక సంస్థల పట్ల ఎంతమాత్రమూ గౌరవం లేకపోవడమే! ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు సరిచేయడం అత్యవసరం. ప్రజలు తమ ఉపాధి, విద్య, ఉద్యోగం తదితర అవసరాల కోసం తమకు అనువైన ప్రాంతాలకు మారుతూ ఉండటం, కొంతమంది చనిపోవడం, 18 ఏళ్లు నిండినవారు కొత్తగా నమోదు కావడం సహజం. ఓటర్ల జాబితా ఆధునీకరణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంగా, రాజకీయ పక్షపాత రహితంగా, అనుమానాలకు తావివ్వని విధంగానూ ఉండాలి. ఎన్నికల సంఘం విశ్వసనీయత అత్యంత ప్రధానం. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాతమైన ఎన్నికలు భారత రాజ్యాంగ మౌలిక వ్యవస్థలో భాగం. వాటిని నిర్వహించే ఎన్నికల కమిషన్ నియామక వ్యవస్థను భ్రష్టుపట్టించిన ఘనత కేంద్రంలోని మోడీ ప్రభుత్వానిదే. ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ఎన్నికల కమిషనర్ల నియామకాలను చేపట్టే విధానాన్ని మార్పు చేసింది. సిజెఐని తొలగించి, ఆ స్థానంలో సీనియర్ కేబినెట్ మంత్రిని సభ్యుడిగా చేర్చింది. ఈ విధానం సరికాదని, ఎన్నికల కమిషనర్ల నియామకంలో అధికార పార్టీకి అనుచితమైన అధికారం ఉండకూడదని ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పును పక్కనపెడుతూ పార్లమెంటులో ఏకపక్షంగా చట్టం చేసింది. ఆ తరువాత సిఇసి 2002-2004 మధ్య ఓటర్ల జాబితా ఆధారంగా ఎస్‌ఐఆర్ చేపట్టాలన్న నిర్ణయంసహా ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలపై ఇసి తీరు అనుమానా లకు తావిస్తోంది. లోక్‌సభ ప్రతిపక్ష నేత మీడియా సమావేశం ఏర్పాటు చేసి, ఓట్ల చోరీ జరిగిందంటూ చేసిన విమర్శలను పరిగణనలోకి తీసుకుని సరిచే యాల్సిన బాధ్యత ఇసిది. అందుకు భిన్నంగా ప్రతిపక్ష నేత తన ఆరోపణలన్నీ నిజమేనని అఫిడవిట్ దాఖలు చేయాలని లేదా క్షమాపణ చెప్పాలని చేసిన ప్రకటన, సిఇసి వ్యవహరించిన తీరు బెదిరించేలా ఉండటం, పాలక పార్టీ అధికార ప్రతినిధిని తలపించడం ఆక్షేపణీయం. బీహార్ ఎస్‌ఐఆర్ ఎన్నికలకు రెండు నెలల ముందు చేపట్టడం, ఆధారంగా తీసుకున్న గుర్తింపు కార్డుల జాబితాను సుప్రీంకోర్టుసైతం ప్రశ్నించింది. రెండు శాతం మందికి ఉండే పాస్‌పోర్టును గుర్తింపు పత్రంగా అంగీకరించి, 87 శాతం మంది వద్ద ఉండే ఆధార్‌ను, స్వయంగా ఎన్నికల కమిషన్ ఇచ్చిన గుర్తింపు కార్డుగా అంగీకరించకపోవడంపై అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. తొలగించిన జాబితాను ఇసి ప్రకటించాల్సి వచ్చింది. బీహార్ ఎస్‌ఐఆర్ తుది జాబితాలో ప్రధానంగా నష్టపోయింది పేదలే. తొలగించిన 65 లక్షల మందిలో అత్యధికులు మహిళలు, ముస్లింలు, ఎస్‌సి, ఎస్‌టి తదితర అణగారిన తరగతులే. 16 లక్షల మంది తొలగింపుతో మహిళా ఓటర్ల శాతం పురుషులతో పోలిస్తే వెయ్యికి 907 నుంచి 892కి పడిపోయింది. బీహార్ ఎస్‌ఐఆర్ ప్రక్రియపై సుప్రీంకోర్టు తుది తీర్పు ఇవ్వని ప్రస్తుత పరిస్థితుల్లో తాజాగా దేశవ్యాప్తంగా ఎస్‌ఐఆర్ చేపట్టడం ఓటర్ల జాబితాలను తారుమారు చేయాలన్న పాలక పార్టీ దుష్ట పథకానికి వత్తాసు పలకడమే. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల అభ్యంత రాలను పక్కన పెట్టడం ఫెడరలిజానికి గొడ్డలిపెట్టు. ప్రజాస్వామ్యానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదు.

## శ్రీశైలం ఘాట్ రోడ్డులో విరిగిపడిన కొండ చరియలు



**శ్రీశైలం, పతాకం న్యూస్:** మొంథా తుపాను ప్రభావంతో నల్లమల ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శ్రీశైలం ఘాట్ రోడ్డులో కొండ చరియలు విరిగి రహదారిపై పడ్డాయి. దీంతో పోలీసులు ఆ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. పెద్ద డోర్నాలలోని అటవీశాఖ చెక్ పోస్ట్ వద్ద వాహనాలను శ్రీశైలం వైపునకు వెళ్లకుండా నిలిపివేశారు. వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై పడిన రాళ్లను పొక్లెయిన్‌తో తొలగిస్తున్నారు.

## భారీ వర్షాలకు మూగజీవుల మృతి



**అరకులోయ, పతాకం న్యూస్:** మండల కేంద్రంలోని, ఇరగాయి పంచాయతీ పరిధిలోని నంద గ్రామంలో బుధవారం తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు మూగజీవులు మృత్యువాత పడ్డాయి. రైతు మాదల చిన్నయ్యకు చెందిన రెండు దుక్కి ఎద్దులు చనిపోగా, మరో రైతు సూరయ్యకు చెందిన నాలుగు మేకలు తీవ్ర చలికి తట్టుకోలేక మృతి చెందాయి. ఈ ఘటనతో తీవ్ర ఆవేదనకు గురైన రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ, ప్రభుత్వ అధికారులు వెంటనే గుర్తించి సర్వే నిర్వహించి, ఆర్థిక పరిహారం అందించి తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

## తుఫాన్ ప్రభావంతో విద్యుత్ సరఫరా నిలిపివేత



**నక్కపల్లి, పతాకం న్యూస్:** మాంథా తుఫాన్ ప్రభావం తో మండలంలో పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మంగళవారం ఉదయం నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతూనే ఉంది. ఉపమాక గొడిచర్ల ,వేంపాడు సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గొడిచర్ల ఎస్ఎస్ పరిధిలోని ఉదయం 10 గంటలకు విద్యుత్తును పునరుద్ధరణ చేసిన తిరిగి మరలా రెండు గంటలకు నిలిపి వేశారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజల నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా తాగునీటికి, వాడుక నీటికి ఇబ్బందులు అధికంగా ఉన్నాయి. ఉప్మాకే ఎస్ఎస్ పరిధిలోని నక్కపల్లి పట్టణానికి తప్ప పల్లె గ్రామాలైన పెద్ద బోధిగల్లం పరిధిలోని విద్యుత్తు పూర్తిగా నిలిపివేశారు. లైన్లో పై చెట్లు కొమ్మలు చెట్లు పడటం వల్ల ఈ అంతరాయం ఏర్పడిందని తెలుపుతున్నారు. పెద్దబోదుగల్లం రూరల్ ఫీడర్ లోని సబ్ రిజిస్టర్ కార్యాలయం ఉండడం వల్ల విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల కార్యాలయంలోని ఏ ఒక్క లావాదేవీ కూడా జరిగి ఉండలేదు. రోజుల తరబడి విద్యుత్ అంతరాయం వల్ల ఆఫీసుల నిర్వహణ కూడా కష్టతరంగా మారింది. విద్యుత్ ఎప్పుడు వస్తుందో తెలియక వినియోగదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

## ఈదురు గాలులకు ఎగిరిపోయిన కారు.. స్వల్ప గాయలతో బయటపడ్డ ప్రయాణికులు



**చింతపల్లి, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా చింతపల్లి మండలం లంబసింగి-కొర్రుబయలు రహదారిపై బుధవారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది. ఈ రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు,బలమైన ఈదురుగాలులకు చింతపల్లి నుండి నర్సీపట్నం వెళ్తున్న కారు అదుపు తప్పి రోడ్డుకు అంచున పడిపోయింది. కారులో ఉన్న ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడగా, పెద్ద ప్రమాదం తప్పింది. వర్షాలు,బలమైన గాలులు కొనసాగుతున్న నేపథ్యంలో రహదారుల పరిస్థితి దారుణంగా మారిందని స్థానికులు తెలిపారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించేవరకు వాహనదారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## దువ్వాడ లో వందేభారత్ ట్రైన్ హాల్ట్



**గాజువాక, పతాకం న్యూస్:** సికింద్రాబాద్ నుంచి విశాఖ (ట్రైన్ నెం. 20707) వస్తున్న వందేభారత్ ట్రైన్ లో ఉన్నదువ్వాడ పరిసర ప్రాంతాలకు చెందిన చాలామంది మొంతా తుఫాన్ కారణంగా విశాఖ లో దిగి అక్కడ నుంచి ఉక్కునగరం, గాజువాక పరిసర ప్రాంతాలకు చేరుకోవడం కష్టం. దానితో ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ కార్యదర్శి, జెడ్ ఆర్ యు సి సి సభ్యులు కె. ఈశ్వర్ రైల్వే అధికారులకు చేసిన విజ్ఞప్తిని మన్నించి వందేభారత్ ట్రైన్ ను అత్యవసరంగా, తాత్కాలికంగా దువ్వాడ రైల్వే స్టేషన్ లో హాల్ట్ ఇచ్చి ప్రయాణికులు సురక్షితంగా వారి గమ్య స్థానాలకు చేరుకొనేలా సహకరించి నందుకు దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ డిఆర్ఎం, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్, డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ పవన్, ఇన్స్పెక్టర్, దువ్వాడ రవి కిరణ్, ఎస్ ఎస్ ఐ కేబిన్, దువ్వాడ ప్రతి అధికారికి,సిబ్బందికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

## ముంపు ప్రాంతాలను పరిశీలించిన పల్లా శ్రీనివాసరావు



**గాజువాక, పతాకం న్యూస్:** మొంథా తుఫాను నేపథ్యంలో ముంపునకు గురైన ప్రాంతాలను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. గాజువాక 86వ వార్డు రాసాలమ్మ కాలనీ, రజక వీధిలో తుఫానుకు గురైన ప్రదేశాలను పరిశీలించారు. స్థానిక ప్రజల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాసాలమ్మ కాలనీలో వర్షపు నీరు ప్రభావం వలన దెబ్బతిన్న రోడ్లు, కాలువలు వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులకు ఆదేశించారు. అలాగే రజక వీధిలో పార్క్ లో వున్న వర్షపు నీరు నిల్వను తోడించాలని అన్నారు. స్థానికులు తమకు దోబీఖానా, మరియు సామాజిక భవనం కావాలని కోరడంతో త్వరలోనే ఆ పనులు పూర్తయ్యేలా కృషి చేస్తానని పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాసరావు,వార్డు టీడీపి అధ్యక్షులు నల్లూరు సూర్యనారాయణ, క్లస్టర్ ఇంచార్జ్ వేగుంట శ్రీనివాస్, జనసేన అధ్యక్షులు కాదా శ్రీను, కార్యదర్శి త్రినాద్, టీడీపి వార్డు ప్రధాన కార్యదర్శి బొడ్డేడ జగదీష్, ఉపాధ్యక్షులు కొర్లన రమేష్, వార్డు బీసీ సెల్ అధ్యక్షులు కోటపాటి సుబ్బయ్య, వార్డు నాయకులు నాగార్జున, బండారు అప్పలనాయుడు, గోవింద్,బాలకృష్ణ,రమణ,సత్య తదితరులు పాల్గొన్నారు.

## మరో 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి నారా లోకేశ్

**అమరావతి, పతాకం న్యూస్:** మొంథా తుపాను తీరం దాటిన నేపథ్యంలో, ప్రభావిత జిల్లాల్లో సహాయక చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. తుపాను అనంతర పరిస్థితులపై విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో హోంమంత్రి అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఆర్టీజీఎస్ సెక్రటరీ కాటంనేని భాస్కర్ పాల్గొన్నారు. తుపాను నష్టం, సహాయక చర్యలపై లోకేశ్ అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "రాబోయే 48 గంటల పాటు అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలి. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని గృహాలు, వాణిజ్య సముదాయాలకు వందశాతం విద్యుత్ సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలి. భారీ వర్షాల కారణంగా రహదారులపై పేరుకుపోయిన మట్టి, బురదను తొలగించేందుకు అగ్నిమాపక శాఖ చర్యలు తీసుకోవాలి" అని ఆదేశించారు. పంట నష్టం అంచనాలను వెంటనే రూపొందించాలని, దెబ్బతిన్న పంటలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని లోకేశ్ సూచించారు. మొంథా తీవ్ర తుపాను కారణంగా సంభవించిన ప్రాణ నష్టం, దెబ్బతిన్న నిర్మాణాలపై పూర్తి నివేదిక అందించాలని కోరారు. వర్షాల ధాటికి దెబ్బతిన్న వంతెనలు, కల్వర్టులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. చెరువులు, కుంటలు, కాలువ గట్లను పటిష్టపరిచేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. "అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. పాముకాటుకు ఉపయోగించే యాంటీ వీనం ఔషధాలను అన్ని ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచాలి. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తుపాను బాధితులు, మత్స్యకారులకు అవసరమైన నిత్యావసర సరకులను వెంటనే పంపిణీ చేయాలి" అని లోకేశ్ అధికారులను ఆదేశించారు.

## సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించిన చిరంజీవి

**హైదరాబాద్, పతాకం న్యూస్:** ప్రముఖ తెలుగు నటుడు చిరంజీవి సామాజిక మాధ్యమాల్లో తనపై అభ్యంతరకర పోస్టులు పెడుతున్నారంటూ మరోసారి పోలీసులను ఆశ్రయించారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా అభ్యంతరకర పోస్టులు పెడుతున్న దయాచౌదరి అనే వ్యక్తిపై చిరంజీవి హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పేరు, ఫోటో, వాయిస్‌ను అనుమతి లేకుండా వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించవద్దని ఇటీవల ఆయన హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు చిరంజీవికి అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు తనకు అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, కొంతమంది ఉల్లంఘనలు ఆపకపోవడంతో ఆయన మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కొన్ని వెబ్‌సైట్లు వ్యవహరిస్తున్నాయని ఆరోపిస్తూ రెండు రోజుల క్రితం చిరంజీవి హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికతను ఉపయోగించి, తన ముఖాన్ని మార్ఫింగ్ చేసి అశ్లీల వీడియోలను సృష్టిస్తున్నారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# "కోసంగి"లో తుఫాను దెబ్బ.. నేలకొరిగిన మూడు ఎకరాల సామాలు పంట



**అరకులోయ, పతాకం న్యూస్:** మండలంలోని పోతంగి పంచాయితీ, కోసంగి గ్రామానికి చెందిన రైతు మట్టం భీమరాజు మూడు ఎకరాల్లో పండించిన సామాలు పంటకు తుఫాను తీవ్ర దెబ్బ తీసింది. పూర్తిగా పండిన సమయంలో కురిసిన తుఫాను వల్ల మొత్తం పంట నేలకొరిగి, భీమరాజు తీరని నష్టాన్ని మిగిల్చిందని అన్నారు. ఇదే విషయంపై అరకు క్యాంప్ ఆఫీస్ తెలియపరచగా అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశాల మేరకు మట్టం భీమరాజు సామాలు పంటను సందర్శించిచారు. అనంతరం
వైసీపీ మండల కార్యదర్శి మట్టం శంకర్ మాట్లాడుతూ, "ఈ పంట భీమరాజు కుటుంబానికి ఏడాది పాటు ఆదాయం కల్పించబోయింది. తుఫాను కారణంగా పూర్తి నాశనం జరగడంతో ఆ కుటుంబం కష్టాల్లో పడింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి, పరిహారం అందించాలి. వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి, తగిన సహాయం అందించాలని" కోరాడు. ఈ ఘటన గ్రామంలోని ఇతర రైతుల్లో కూడా ఆందోళన కలిగించింది. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా కురిసిన అకాల వర్షాలు, తుఫానుల వల్ల చాలా ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయి. రైతులు పరిహారం కోసం ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఈ గ్రామంలో సర్వే చేపట్టి, నష్టాలను అంచనా వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## 46వ రోజుకు చేరిన
# మత్స్యకారుల నిరసన దీక్ష



**నక్కపల్లి, పతాకం న్యూస్:** తుఫాను సైతం లెక్కచేయకుండా మత్స్యకారులు 46వ రోజు నిరసన దీక్ష కొనసాగించారు. విషం చిమ్మే కంపెనీలు తమకు వద్దని బల్క్ డ్రగ్ వద్దు రాజయ్యపేట ముద్దు అంటూ నినాదాలు చేశారు. 46 రోజులుగా బల్క్ డ్రగ్స్ పార్క్ వద్దంటూ అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో తుఫానులో కూడా నిరసనను కొనసాగిస్తున్న గ్రామస్తులు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ సముద్రం మత్స్యకారులకు ప్రాణమని అలాంటి ప్రాణమైన సముద్రాన్ని కలుషితం చేసే దానికి ఇలాంటి బల్క్ డ్రగ్స్ పార్కు ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఫ్యాక్టరీల వలన పూర్తిగా మత్స్యకారుల మనుగడ కనుమరుగవుతుందని దీనివలన రాష్ట్రవ్యాప్తంగా మత్స్య సంపద నాశనం అవుతుందని , పచ్చటి పొలాలు నాశనం అవుతాయని ఇలాంటి పరిణామాలు దారి తీసే బల్క్ డ్రగ్స్ పార్క్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే అంతవరకు ఈ ఉద్యమం కొనసాగుతుందని ఈ ఉద్యమంలో మా ప్రాణ త్యాగాలకైనా వెనకాడబోమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు బి.బాబ్జి, మత్యకార నాయకులు గోసల సోము, తాతీలు , సూరిబాబు , జి.స్వామి, కాశి, నానాజీ, చేపల సోమేశ్, దేలపల్లి రమణ, కోదండ, రమణ తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను కూల్చివేసి నూతన భవనాలు మంజూరు చేయాలి: యుటిఎఫ్



**అరకులోయ, పతాకం న్యూస్:** డుంబ్రిగూడ మండలం పోతంగి పంచాయితీ పరిధిలోని వంతర్డ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం మంగళవారం అర్ధరాత్రి సమయంలో తుపాను కారణంగా కూలిపోయింది. ఈ ఘటనపై మండల యుటిఎఫ్ సంఘ నాయకులు స్పందించి, జిల్లా కార్యదర్శి ఎస్. కన్నయ్య, మండల అధ్యక్షుడు ఎస్. బాలకృష్ణ, సీనియర్ నాయకులు టి. సుబ్బారావు, కార్యదర్శి మేఘనాథ్ ఘటనాస్థలాన్ని సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ పాఠశాలలో 19 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారు. సెలవు రోజు కావడంతో పెను ప్రమాదం తప్పిందని ఉపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్ తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ, ఈ భవనం నిర్మించి సుమారు 35 సంవత్సరాలు అయిందని, పలుమార్లు స్పందన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశామని, అయినా అధికారులు స్పందించలేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం నూతన భవనం మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎస్. కన్నయ్య మాట్లాడుతూ, మండలంలో అనేక పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నాయని, నూతన భవనాలు మంజూరు చేయడం, రిపేర్లకు నిధులు కేటాయించడంలో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి కొనసాగితే మరిన్ని ప్రమాదాలు సంభవిస్తాయని హెచ్చరించారు. మండల అధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ, శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చివేసి నూతన భవనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తుంద్రంగూడ పాఠశాల భవనం కూడా శిథిలావస్థలో ఉందని, పలుమార్లు విన్నవించినా అధికారుల నుంచి సరైన స్పందన లేదని విమర్శించారు. శిథిల భవనాల వైపు విద్యార్థులు, గ్రామస్తులు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సంఘ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పూడిమడక మత్స్యకారులను
# ప్రభుత్వం ఆదుకోవాలి



**అనకాపల్లి, పతాకం న్యూస్:** తుఫాను కారణంగా గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు గ్రామంలో రేకు, పూరి గుడిసెలు తీవ్రంగా నష్టపోయాయి వీరికి ప్రభుత్వం నష్టపరిహారం అందించి మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలని సిపిఎం నేతలు బుధవారం పూడిమడక గ్రామంలో పర్యటించారు. పూడిమడక తుఫాను భవనంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించి గ్రామంలో తుఫాను వల్ల ఇబ్బందులుపడుతున్న మత్స్యకార కుటుంబాలను పరామర్శించడం జరిగింది. ప్రభుత్వం మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం అందచేస్తామని ప్రకటించింది ఒక్క బియ్యంతో కాకుండా మత్స్యకారులకు నిత్యావసర వస్తువులు బియ్యంతోపాటు పప్పులు నూనెలు వంటి నిత్యావసర వస్తువులు సరఫరా చేసి ఆదుకోవాలని కోరారు. తుఫాను కారణంగా తుఫానుకు ముందు మూడు రోజులు తుఫాన్ తర్వాత మూడు రోజులు వారం రోజులపాటు వేటసాగక అర్థాకలితో బతుకుతున్నారు వీరికి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అచ్చుతాపురం కన్వీనర్ ఆర్.రాము, పూడిమడక శాఖ కార్యదర్శి చాపల తాతయ్య, మైలపల్లి నూకరాజు, తెడ్డుకాసులు, మైలపల్లి నాయుడు, మత్స్యకారులు పాల్గొన్నారు.

## మొంథా తుపాను బాధిత కుటుంబానికి వైఎస్ఆర్సీపీ నాయకుల పరామర్శ



**డుంబ్రిగూడ, పతాకం న్యూస్:** బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తీవ్ర తుపాను ప్రభావంతో ఏపీలోని కోస్తా ప్రాంతాల్లో భారీ వర్షాలు, ఈదురు గాలులు కురవడంతో పలు చోట్ల ఆస్తి నష్టాలు చోటుచేసుకున్నాయి. మండల కేంద్రంలోని అరకు నియోజకవర్గంలోని సొవ్వ పంచాయితీ, సాగిరివలస గ్రామంలో జీలుగుకళ్ళు చెట్టు ఇల్లు పై పడి ఒక ఇల్లు భాగం పూర్తిగా ధ్వంసమైంది. గసభలో కిముడు సతీష్ తుపాను కారణంగా రేఖీళ్లు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటన విషయం అరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి సమాచారం అందగా, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశాల మేరకు వైఎస్ఆర్సీపీ నాయకులు బాధిత కుటుంబానికి పరామర్శించారు. అరకు అసెంబ్లీ వైఎస్ఆర్సీపీ సోషల్ మీడియా ప్రతినిధి పాంగి నరసింగరావు, డుంబ్రిగూడ మండల వైఎస్ఆర్సీపీ ఉపాధ్యక్షుడు పొట్టింగి రాంప్రసాద్ లు సాగిరివలస గ్రామానికి చేరుకుని వంతల గోపినాథ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, పడుకున్న సమయంలోనే చెట్టు పడి ఇల్లు ధ్వంసమైందని, ఇంట్లో ఉన్న ధాన్యాలు, చోడి వంటి నిత్యావసర సామగ్రి తడిచిపోయిందని, అయితే దేవుడి కృప వల్ల ప్రాణ నష్టం జరగలేదని చెప్పారు. ఇల్లు మరమ్మత్తు కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు.
వైఎస్ఆర్సీపీ నాయకులు మాట్లాడుతూ, ఈ సమస్యను అరకు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్తామని, ఎమ్మెల్యే ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరగా పరిష్కారం కావాలని కృషి చేస్తారని భరోసా ఇచ్చారు. తుపాను ప్రభావంతో బాధితులకు ప్రభుత్వం అందరికీ తగిన సహాయం అందించాలని, పార్టీ నాయకత్వం కూడా బాధితుల వెనుక నిలబడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొర్ర దొన్ను, వాలంటీర్ కొర్ర రాజు, పేసా కార్యదర్శి వంతల గోవర్ధన్, వైఎస్ఆర్సీపీ కార్యకర్తలు, సాగిరివలస గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## అదాని స్మార్ట్ మీటర్లు, భూ కేటాయింపులపై
# విచారణ జరపాలి
### ప్రభుత్వానికి ఇఎఎస్ శర్మ లేఖ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** రాష్ట్రంలో అదానీ గ్రూపుతో గత ప్రభుత్వాలు చేసుకున్న పలు కీలక ఒప్పందాలు, స్మార్ట్ మీటర్ల అంశంపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇఎఎస్.శర్మ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, ఇంధన శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. ముందున్న ప్రభుత్వం ఎంచుకున్న అదాని స్మార్ట్ మీటర్ల కారణంగా రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులు అధిక ఛార్జీలు భరించాల్సి వస్తోందని, ఈ విషయంలో ప్రస్తుత ప్రభుత్వం నిశ్శబ్దంగా ఉండడం బాధాకరమని ఆయన లేఖలో ప్రధానంగా ప్రస్తావించారు. విశాఖలోని మధురవాడలో డేటా సెంటర్ ఏర్పాటు ముసుగులో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం వేలాది కోట్ల విలువైన 270 ఎకరాల కొండ పోరంబోకు భూమిని చట్టవిరుద్ధంగా అదాని గ్రూపునకు కట్టబెట్టిందని తెలిపారు. తక్షణమే ఆ భూమిని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థ ఎపిఎండిసి మధ్యప్రదేశ్‌లోని సులియారీ బొగ్గు గని మైనింగ్ లీజును తీసుకుని కేంద్ర ప్రభుత్వ ప్రమేయంతో ఆ మైనింగ్ పనిని 2021-22లో అదానికి అప్పగించిందని శర్మ తెలిపారు. ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వంపై పడిన అదనపు ఆర్థిక భారంపై నిష్పాక్షికమైన దర్యాప్తు చేయించాలని కోరారు. అదానికి అప్పగించిన మైనింగ్ పనిని రద్దు చేసి ఆ బాధ్యతను కేంద్ర ప్రభుత్వ సంస్థలకు అప్పగించాలని సూచించారు. 2014 నుంచి రాష్ట్రంలో వివిధ ప్రభుత్వాలు అదాని కంపెనీలకు భూములను, ఇతర వనరులను ఉదారంగా కేటాయించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా విషయాలపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదాని గ్రూప్‌తో జరిగిన అన్ని ఒప్పందాలపై, ముఖ్యంగా స్మార్ట్ మీటర్ల విషయంలో వినియోగదారులపై పడుతున్న అదనపు భారంపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి, ప్రజాప్రయోజనాలను కాపాడాలని శర్మ తన లేఖలో విజ్ఞప్తి చేశారు.


## రైవాడ రిజర్వాయర్‌ను సందర్శించిన
# కలెక్టర్, ఎమ్మెల్యే బండారు





**దేవరాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం రైవాడ రిజర్వాయర్‌ను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సందర్శించారు. రైవాడ రిజర్వాయర్ లో ఇప్పటికే ఇన్ఫ్లో అవుట్ ఫ్లో ఎక్కువ మోతాదులో ఉందని.. మొంథా తుఫాను తాకిడి ఎక్కువ అవడంతో ఇప్పటికే 4గేట్లు ఎత్తివేశామని అధికారులు తెలిపారు. ఈ తుఫాను ప్రభావం వల్ల దేవరాపల్లి మండలంలో మాడుగుల నియజకవర్గం మొత్తం 19 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే 355 కుటుంబాలను తరలించామన్నారు. మాడుగులలో 10కేంద్రాలు, చీడికాడలో రెండు కోటపాడు లో రెండు దేవరాపల్లిలో ఐదు పునరావస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే అన్నారు. పూరి గుడిసెల్లో నివాసం ఉంటున్న కుటుంబాలను ముందస్తుగా సమాచారం అందించి తరలించామని అధికారులు అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్డిఓతో పాటు ఇరిగేషన్ డి డి,ఈ ఈ, సీఐ పైడింనాయుడు తో పాటు మండల అధికారులు, మండల టీడీపీ అధ్యక్షుడు సూర్యనారాయణ,రైవాడ రిజర్వాయర్ చైర్మన్ పోతల పాత్ర నాయుడు కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు

## హెచ్‌పీసీఎల్ కర్మాగారంలో ఒక్కసారిగా ఉవ్వెత్తిన అగ్ని కీలలు



**గాజువాక, పతాకం న్యూస్:** హెచ్‌పీసీఎల్ కర్మాగారంలో బుధవారం సాయంత్రం సమయం 5:20 నిమిషాలకి ఒక్కసారిగా చిమ్నీ నుంచి భారీ శబ్దం వచ్చి అగ్ని కీలలు ఎగిసిపడ్డాయి. పారిశ్రామిక ప్రాంత ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. లోపల ఏదైనా ప్రమాదం జరిగిందా, లేక వృధాగా పడి ఉన్న ఆయిల్ ఫైర్ అయ్యి శబ్దం యాదృచ్ఛికంగా వచ్చిందా, తెలియాల్సి ఉంది. ఉధృతంగా ఎగిసిపడుతున్న అగ్ని కీలలు దృశ్యాల్లో చూడగలరు.

# తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస చర్యలు వేగవంతం చేయాలి: కలెక్టర్



**అనకాపల్లి, పతాకం న్యూస్:** "మొంథా" తుఫాను ప్రభావంతో చోటుచేసుకున్న భారీ వర్షాలు, గాలుల కారణంగా తుఫాను అనంతర పరిణామాలు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ బుధవారం చోడవరం మండలంలోని తుఫాను పునరావాస శిబిరాలను పరిశీలించారు. కలెక్టర్ ద్వారకానగర్, బాలాజీ నగర్, రెల్లి వీధి ప్రాంతాలను సందర్శించి, ప్రభావిత ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడారు. వారి సమస్యలు, అవసరాలను తెలుసుకొని, తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల తాగునీరు, విద్యుత్, వైద్యసేవలు, ఆహార పంపిణీ వంటి చర్యలు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పునరావాస కేంద్రాల్లో సరిపడ మౌలిక సదుపాయాలు కల్పించి, ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సందర్శనలో తహసీల్దార్, మరియు విభాగాధికారులు పాల్గొన్నారు.

## సూరాడపేటలో కూలిన మత్స్యకార గృహాలు



**కాకినాడ, పతాకం న్యూస్:** మొంథా తుపాను ప్రభావంతో ఎగసిపడుతున్న సముద్రపు అలల ధాటికి కాకినాడ జిల్లా సూరాడపేటలో నాలుగు మత్స్యకార గృహాలు ధ్వంసమయ్యాయి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడల్లా తీర ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న ఉప్పాడ, కొనపాపపేట, సూరాడపేట, మాయాపట్నం అమీనాబాద్, కొమరగిరి, నేమాం, సుబ్బంపేట గ్రామాలు సముద్ర కోతకు గురవుతున్నాయి. ప్రస్తుతం ఉప్పాడ తీరంలో రోడ్డుకి గండి పడడంతో ఇళ్లల్లో నివాసం ఉంటున్న మత్స్యకారుల్లో ఆందోళన ఎక్కువైంది. ఈ గ్రామాల ప్రజలను స్థానికంగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు అధికారులు తరలించారు. అలల ఉధృతికి కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డుకు రక్షణగా వేసిన పెద్ద పెద్ద బండ రాళ్లు సైతం అలల తాకిడికి ఎగిరిపడ్డాయి.

## అజారుద్దీన్‌కు మంత్రి పదవి?




**హైదరాబాద్, పతాకం న్యూస్:** కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి లభించినట్టు తెలుస్తోంది. ఎల్లుండి తెలంగాణ మంత్రివర్గ విస్తరణ జరగనుందని, ఆయన మంత్రిగా ప్రమాణం చేస్తారని కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మంత్రివర్గ విస్తరణకు పార్టీ అధిష్ఠానం నుంచి అనుమతి లభించినట్లు సమాచారం. తెలంగాణ మంత్రివర్గంలో 18 మందికి అవకాశం ఉండగా, ప్రస్తుతం 15 మంది మంత్రులు ఉన్నారు. మరో ముగ్గురికి అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మైనార్టీ వర్గానికి చెందిన అజారుద్దీన్‌కు మంత్రిగా అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. మంత్రివర్గంలో ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యం కల్పించాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. అజారుద్దీన్ గత అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుత ఉప ఎన్నికల్లోనూ పోటీ చేసేందుకు ఆసక్తి చూపినప్పటికీ, ఆయనకు ఎమ్మెల్సీ పదవిని ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించింది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాంల పేర్లను ఎంపిక చేసి, గవర్నర్ ఆమోదం కోసం పంపింది. గవర్నర్ ఇంకా ఆమోదం తెలపాల్సి ఉంది. అయినప్పటికీ అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ఏఐసీసీ ఆమోదం తెలిపినట్లు సమాచారం.

## తుఫాన్ తాకిడికి వంతర్ద పాఠశాల నేలమట్టం



**డుంబ్రిగూడ, పతాకం న్యూస్:** తీవ్ర తుఫాను,అకాల వర్షాల ప్రభావంతో డుంబ్రిగూడ మండలంలోని పోతంగి పంచాయతీ పరిధిలోని వంతర్ద ఎంపీపీ పాఠశాల భవనం మంగళవారం అర్ధరాత్రి పూర్తిగా కూలిపోయింది. ఈ ఘటన గ్రామస్థుల్లో భయాన్ని సృష్టించింది. గ్రామస్థుల ప్రకారం, తుఫాను వల్ల కురిసిన భారీ వర్షాలు భవనాన్ని మరింత బలహీనపరచి, అర్ధరాత్రి సమయంలో ఇది నేలమట్టం అయింది. అదృష్టవశాత్తు, ఈ సమయంలో పాఠశాలలో ఎవరూ లేరు కాబట్టి పెద్ద ప్రమాదం తప్పింది. "ఇది మా గ్రామ పిల్లల విద్యా భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే ఘటన. భవనం శిథిలావస్థలో ఉందని గతంలోనే అధికారులకు తెలిపాము, కానీ చర్యలు తీసుకోలేదు" అని స్థానికులు తెలిపారు.ప్రస్తుతం పాఠశాలలో 50 మందకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. స్థానికులు కొత్త భవనం నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని కోరుతున్నారు.విద్యా శాఖ అధికారులు రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో భవనాల పరిశీలన చేపట్టాలని ఆదేశాలు జారీ చేయాలని మండల వైసిపి అధ్యక్షులు పాంగి పరశు రాం,మండల కార్యదర్శి హెచ్ బి రామునాయుడు అధికారులను కోరారు.

## అర్ధరాత్రి కూలిన పూరిల్లు.. బాధిత కుటుంబాన్ని సందర్శించిన కొయ్యూరు పోలీస్ శాఖ



**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం రావనపల్లి పంచాయతీ పరిధిలోని రేవడ వీధి గ్రామానికి చెందిన మాదల గంగరాజు, చిన్నమ్ముల దంపతులకు చెందిన తాటాకుల ఇల్లు మంగళవారం (అక్టోబర్ 28) అర్ధరాత్రి సమయంలో మొంథా తుఫాన్ ప్రభావంతో కూలిపోయింది.ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించకపోయినప్పటికీ, కుటుంబం ఆస్తి నష్టం ఎదుర్కొంది. ఒక్కసారిగా చోటుచేసుకున్న ఈ ప్రమాదంతో వారు భయాందోళనకు గురై దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రస్తుతం నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం సహాయం అందించాలని బాధితులు కోరుతున్నారు.అయితే సమాచారం అందుకున్న కొయ్యూరు సిఐ శ్రీనివాస్, ఎస్ఐ కిషోర్ వర్మ, సర్పంచ్ చందర్రావు, విఆర్వో రేవడి వీధి గ్రామంను సందర్శించారు.ఈ సందర్భంగా సి ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లలో ఉండొద్దని, ఆవశ కేంద్రాలకు వెళ్లాలని, భారీ తుఫాన్ కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుకోని సంఘటనలు జరిగితే వెంటనే తెలపాలని సూచించారు.

## 'మొంథా' తుఫాన్ నష్టం తగ్గించడంలో ప్రభుత్వ కృషి అభినందనీయం:స్పీకర్ అయ్యన్న



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** 'మొంథా' తుఫాను ప్రభావం తక్కువగా ఉండటాన్ని భగవంతుని దయగా అభివర్ణిస్తూ, ప్రభుత్వ సమయస్ఫూర్తి చర్యలతో పెద్ద నష్టం తప్పించగలిగామని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మీడియా సమావేశంలో తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముందుగానే తుఫాను తీవ్రతను అంచనా వేసి, ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం వల్లే ఈ ఫలితం సాధ్యమైందన్నారు. అధికారులు పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలించడం, వారికి భోజన సదుపాయాలు కల్పించడం అభినందనీయమని స్పీకర్ పేర్కొన్నారు. ప్రాణనష్టం లేకుండా ప్రజలను రక్షించడంలో అధికారులతో పాటు అన్ని స్థాయిల్లోని సిబ్బంది, నాయకులు, స్వీపర్లు కూడా సమష్టిగా కృషి చేశారని కొనియాడారు. తుఫాను తర్వాత రోడ్లపై పడిన చెట్లను తొలగించి రవాణాకు అంతరాయం రాకుండా చూసిన అధికారుల పనితీరును ప్రశంసించారు. ఇళ్లకు నష్టం వాటిల్లిన వారు తమ మండల ఎమ్మార్వో కార్యాలయంలో వివరాలు తెలియజేయాలని సూచిస్తూ, ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు జరుగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా, పశువుల గడ్డి తడిసి మేతకు ఇబ్బంది పడుతున్న రైతులకు 50% సబ్సిడీపై పశువుల దాణా, పచ్చి గడ్డి సరఫరా చేస్తామని ప్రకటించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు.

## అమలాపురంలో మెడికల్ కాలేజ్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు కార్యక్రమం



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నం మండలం అమలాపురం గ్రామంలో మెడికల్ కాలేజ్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నర్సీపట్నం మెడికల్ కాలేజ్‌ను కూటమి ప్రభుత్వం అన్యాయంగా ప్రైవేటీకరణ చేస్తున్నదని, దీని ద్వారా ఈ ప్రాంత ప్రజలకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని తెలిపారు. ప్రైవేటీకరణ కారణంగా పేద ప్రజలకు ఉచిత వైద్యం అందే అవకాశం లేకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కోటి సంతకాలు కార్యక్రమంలో భాగంగా అమలాపురం గ్రామ ప్రజల సంతకాలను సేకరించామని గణేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సూపర్ ఎంపీపీ శేఖర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో వైద్య శిబిరం కార్యక్రమం



**అడ్డతీగెల, పతాకం న్యూస్:** రంపచోడవరం డివిజన్ జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు ఎల్లవరం ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దేవి ప్రియాంక ఆధ్వర్యంలో అడ్డతీగల ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల యందు మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగిందని. ఈ వైద్య శిబిరం వల్ల పిల్లలకు సీజనల వ్యాధుల గూర్చి వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత కోసం అలాగే జ్వరాలు మరియు రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులను రక్త పరీక్షలు చేసి వైద్యం అందించడం అయినదని.మొంథా తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలని తగు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులను హెచ్చరించారు. ఇదే కార్యక్రమం డాక్టర్ దేవి ప్రియాంక ఆధ్వర్యంలో ఏకలవ్య స్కూల్ నందు అలాగే జిల్లా పరిషత్ హై స్కూల్ నందు మెడికల్ క్యాంపు పెట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ జిల్లా మలేరియా ఆఫీసర్,హెచ్. వి చిన్నయమ్మ,సిహెచ్ఓడబ్ల్యూ వెంకట్, విజయలక్ష్మి, ఎ ఎన్ ఎమ్ వి హెల్త్ అసిస్టెంట్లు, 104 సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కస్తూర్బా పాఠశాలలో కలకలం

### షార్ట్ సర్క్యూట్‌తో ఆందోళన చెందిన బాలికలు



**విజయనగరం, పతాకం న్యూస్:** గుర్ల కస్తూర్బా బాలికల విద్యాలయంలో కలకలం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్‌షర్క్యూట్ జరిగి వ్యాపించిన మంటలను ఆపేందుకు వెళ్లిన ఐదుగురు విద్యార్థినులకు గాయాలయ్యాయి. వారిని వెంటనే ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ఎవరికీ ఎలాంటి అపాయం లేదని వైద్యులు ధ్రువీకరించారు. వివరాల్లోకి వెళితే.. గుర్ల కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఇంటర్ సెకండియర్ తరగతి గదిలో మంగళవారం సాయంత్రం విద్యుదాఘాతం జరిగి ఫ్యాను తగలబడి ంది. అదే సమయంలో అగ్గి పుట్టి పక్కనే ఉన్న డార్మిటరీ, పిల్లల దుస్తులకు వ్యాపించింది. దుస్తులు తగలబడటాన్ని గమనించిన ఐదుగురు విద్యార్థినులు మంటలను ఆపేందుకు ప్రయత్నించారు. ఆ క్రమంలో వారిపైకి అగ్గినిప్పులు తుళ్లి గాయపడ్డారు. వై.శ్రావణి, జె.సుజాత, ఈ.వెంకటలక్ష్మి, జి.కృపాసంధ్య, కె.దీక్షితకు గాయాలయ్యాయి. ఈ ఘటనతో ఒక్కసారిగా విద్యాలయంలో కేకలు, అరుపులు మిన్నంటాయి. వెంటనే సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో వారు 108 ద్వారా నెల్లిమర్ల ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారంతా ఆరోగ్యంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. వర్షాలకు గోడలు బాగా తడవడంతో విద్యుదాఘాతం జరిగి ఉంటుందని పాఠశాల ఎస్‌వో జానకి అభిప్రాయపడ్డారు. ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే కలెక్టర్ రామసుందర్‌రెడ్డి సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థినుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఘటన గురించి తెలుసుకుని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నెల్లిమర్ల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను టీడీపీ నాయకులు కిమిడి రామమల్లిక్‌నాయుడు, వి.సన్యాసినాయుడు, వి.శివప్రసాద్, కె.సూర్యనారాయణ పరామర్శించారు.

## సీఎం దృష్టికి నియోజకవర్గ సమస్యలు



**విజయనగరం, పతాకం న్యూస్:** ముఖ్యమంత్రి చంద్రబాబును విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అమరావతిలో మర్యా దపూర్వకంగా కలిశారు. విజయనగరం నియోజక వర్గం లో నెలకొన్న పలు సమస్యలను ఆయనకు వివరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి సహకరించాలని ఆమె కోరారు. విజయనగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్), ప్రసూతి, చైల్డ్ ఆసుపత్రి(ఎంసీహెచ్ -ఘోషా)లో ప్రాథమిక మౌలిక సదుపాయాలతో పాటు అవసరమైన సౌకర్యాలను కల్పించి(జీజీహెచ్-రూ 2.92 కోట్లు, ఎంసీహెచ్ ఘోషాకి-2.73 కోట్లు) మొత్తం 5.65 కోట్లు మంజూరు చేయాలని కోరారు. విజయనగరం శివారు ప్రాంతమైన వేణుగోపాలపురంలో నూతనంగా 220/132/33 కిలో వాట్స్ సబ్ స్టేషన్‌ను నిర్మించుటకు ప్రభుత్వం మంజూరు చేసిందని, ఈ పనులు వేగవంతంగా జరిగే విధంగా చూడాలని పేర్కొన్నారు. విజయనగరం నియోజకవర్గ పరిధిలోని నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా గత ప్రభుత్వం భూసేకరణ చేసిందని, భూసేకరణ పరిహారాన్ని రైతులకు అందించాలని కోరారు. విజయనగరంలోని పెద్ద చెరువు నుంచి పద్మావతి నగర్ వరకూ ప్రధాన కాలువను ఏర్పాటు చేయాలని, ఇందుకు డీపీఆర్‌ని కూడా ప్రభుత్వానికి నివేదించామని, నగరపాలక సంస్థ దీనిని చేపట్టేందుకు నిధుల సమస్య కారణంగా, వీఎంఆర్‌డీఏ ద్వారా ఈ డీపీఆర్ ప్రాప్తికి 32 కోట్ల 51 లక్షలు ఇప్పించాలని కోరారు. ఎస్పీ కార్యాలయం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో వాటి నిర్మాణానికి అవసరమైన నిధులు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ కూడా డీజీపీ కార్యాలయానికి సంబంధిత నివేదికను అందించారని, దీనికి నిధులు కేటాయించాలని కోరారు.

## సీఎంఆర్ఎఫ్‌తో ఆరోగ్య భరోసా



**ఒంగోలు, పతాకం న్యూస్:** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆరోగ్య భరోసా లభిస్తుందని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ తెలిపారు. ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో 52 మంది లబ్ధిదారులకు రూ. 60. 99 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ నిరుపేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి అండగా ఉంటుందన్నారు. పేద, మధ్య తరగతివారు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడకుండా వారి వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం అందజేస్తున్న నగదు లబ్ధిదారులకు సహాయపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు బండారు మదన్, మహిళ అధ్యక్షురాలు పెద్దిశెట్టి వరలక్ష్మి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మొంథా తుఫాను ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే పంచకర్ల



**సబ్బవరం, పతాకం న్యూస్:** పెందుర్తి నియోజకవర్గం, సబ్బవరం మండలంలో నీటి మునిగిన పరిసర ప్రాంతాలను పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు పరిశీలించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాను ప్రభావం వల్ల ప్రజలకు ఎలాంటి ఆస్తి నష్టం ప్రాణం నష్టం జరగకూడదని పెందుర్తి నియోజకవర్గం పరిధిలో పరవాడ, సబ్బవరం, పెందుర్తి మండలాలలో మంగళవారం పంచకర్ల రమేష్ బాబు విస్తృతంగా పర్యటించి అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి, బుధవారం తుఫాను ప్రభావిత ముంపు ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా సబ్బవరం తాసిల్దార్ బి.చిన్న కృష్ణ, ఎంపీడీవో బి.పద్మజ, మండల ఇంజనీరింగ్ అధికారి, పి.హరిణి, రోడ్లు భవనాల శాఖ, సీఐ రామచంద్రరావు, అధికారులతో కలిసి సబ్బవరం మండలం టెక్కలిపాలెం, సబ్బవరంబి గుల్లేపల్లి ప్రధాన రహదారిపై ఆదిరెడ్డిపాలెం వద్ద గల బొర్రమ్మ గడ్డ క్యాజుబివే, పినగాడి బిమొగలి పురం రోడ్డులో వరి పొలాల్లోంచి రోడ్డు పైగా ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించారు. సుమారు 17 గ్రామాలకు పైగా రహదారి సౌకర్యం కలిగిన సబ్బవరం బిగుల్లేపల్లి రహదారిపై "క్యాజ్ బివే"పై పొంగి ప్రవహించడంతో రెండు రోజులుగా ఈ రహదారిని అధికారులు మూసేశారు. బుధవారం తుఫాను తీరాన్ని తాకడంతో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. దీంతో అధికారులు అంతా అప్రమత్తమై, తుఫాను కారణంగా దెబ్బతిన్న రోడ్లు, సాగునీటి చెరువుల, గడ్డలు, వరి పంట నష్టం, పూరిల్లులు, కచ్చా ఇండ్లుకు జరిగిన నష్టాన్ని త్వరగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపించాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో అధికారులతో పాటు మండల జనసేన పార్టీ అధ్యక్షులు కర్రీ కనకరాజు, రాష్ట్ర కనీస వేతనాల సంఘం డైరెక్టర్ బలిరెడ్డి అప్పారావు, రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందల వెంకటరమణ, సీనియర్ నాయకులు గొర్లి కుమార స్వామి, బంతికొల్ల పద్మ, కోటన అప్పారావు, ఎంపీటీసీ సింగంపల్లి శ్రీనివాసరావు, రోమాల చంద్రశేఖర్, కిల్లి వెంకట సత్తి, మంగరాజు, సేనాపతి సోమశేఖర్, రాపర్తి కిషోర్, రాపర్తి కృష్ణమోహన్, నేటిపల్లి మహేష్, సబ్బవరం మండలం ఉమ్మడి ఎన్డిఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శిథిలావస్థ పాఠశాలలను నెల రోజుల్లో కూల్చేయండి: జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



**అరకులోయ, పతాకం న్యూస్:** మండల కేంద్రం డుంబ్రిగుడలో అభివృద్ధి పనులు పక్కగా అమలయ్యేలా ప్లాన్ చేయిండి. శిథిలావస్థకు చేరిన పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల భవనాలను నెల రోజుల్లో కూల్చివేయాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. డుంబ్రిగుడలో పర్యటించిన ఆయన తుపాను ప్రభావంతో దెబ్బతిన్న నివాస గృహాలను పరిశీలించారు. డ్రైనేజీ నిర్మాణాల్లో గృహ లబ్దిదారులతో మాట్లాడి ప్రక్రియను చేపట్టాలన్నారు. ఎకో టూరిజం ద్వారా అభివృద్ధి చెందిన చాపరాయి జలవిహారికి ఆదాయంలో పంచాయతీకి 20 శాతం కేటాయించి అభివృద్ధికి సహకరించాలని ఎంపీటీసీ సభ్యురాలు గీత, సర్పంచి వెంకటరావు విన్నవించారు. చాపరాయిలో పార్కింగ్ అభివృద్ధికి ఐటీడీఏ యంత్రాంగం చూసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని తహసీల్దార్ త్రివేణికి ఆదేశించారు. మార్గ మధ్యలోని లివిటిపుట్టు గ్రామస్థులు చేరుకుని పాఠశాల భవనాన్ని పూర్తి చేయాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం తుపాను ప్రభావంతో వంతార్డలో నేలమట్టమైన పాఠశాల భవనాన్ని పరిశీలించిన ఆయన, ప్రమాదకరంగా మారిన శిథిలావస్థ భవనాల తొలగింపుకు నెల రోజుల్లో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తుపాను నష్ట నివేదికను త్వరగా అందజేయాలని సూచించారు. తెదేపా మండల అధ్యక్షుడు ఆనందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు సుబ్బారావు, టీఎస్టీయూ ప్రధాన కార్యదర్శి స్వామి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 'అల్లూరి జిల్లా గిరిజన వసతి గృహాల దుస్థితి?



- విరిగిన కిటికీలు, పగిలిన తలుపులు
- సమస్యల కొలువుతో విద్యార్థుల ఇక్కట్లు

**అల్లూరి జిల్లా, పతాకం న్యూస్:** మొంథా తుపాన్‌తో రాష్ట్రంతా వాతావరణం ఎంత చల్లగా మారిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దీనికి తోడు, విరిగిన కిటికీలు, పగిలిన తలుపులు చల్లగాలిని ఏ మాత్రం ఆపలేకపోతున్నాయి. దీంతో చలికి గజ..గజ వణుకుతూ ఒక మూలకు ముడుచుకోవాల్సిందే! ఇది చాలదన్నట్లు ఇది చాలదన్నట్లు ఎప్పుడో బిగించిన సోలార్ హీటర్లు చెడిపోవడంతో తప్పని చన్నీటి స్నానాలు! ఇది అల్లూరి జిల్లా కేంద్రమైన పాడేరులో తలారి సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతిగృహం దుస్థితి! జిల్లా కలెక్టర్, పాడేరు ఐటిడిఎ పిఒ, టిడబ్ల్యు డిడి కార్యాలయాలకు అర కిలోమీటరు, పాడేరు మండల ఎటిడబ్ల్యు కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉంది. ఈ హాస్టల్‌లో 496 మంది విద్యార్థులు ఉన్నారు.! వీరికి తాగేందుకు పరిశుభ్రమైన నీరు లేదు. హాస్టల్ రూముల్లో సరిపడా విద్యుత్ సదుపాయం, లైటింగ్ లేవు. మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. హాస్టల్ పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉంది. దోమలు ముసురుకుంటున్నాయి.

ఈ హా జిల్లా కేంద్రంలోని హాస్టల్ పరిస్థితే ఇలా ఉంటే మారుమూల ప్రాంతాల్లోని వసతి గృహాల పరిస్థితి ఎలా ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. జిల్లా వ్యాప్తంగా పలు హాస్టళ్లను పరిశీలిస్తే ఈ పరిస్థితులు స్పష్టంగా కనబడతాయి. దాదాపుగా అన్ని చోట్ల ఇటువంటి పరిస్థితులే కనిపించాయి. పాడేరు ఐటిడిఎ పరిధిలో ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు, గిరిజన సంక్షేమ ఆశ్రమాలు 150 నడుస్తున్నాయి. గురుకులాలు 31 ఉన్నాయి. వీటిలో చాలా సంక్షేమ వసతి గృహాల్లో పలు సమస్యలు తిష్టవేశాయి. పారిశుధ్యం లోపించింది. అధ్వాన స్థితిలో మరుగుదొడ్లు ఉన్నాయి. తలుపులు, కిటికీలు, రక్షణ గోడలు లేని భవనాలే అధికంగా దర్శనమిస్తున్నాయి. దోమల బెడద అధికంగా ఉంది. పలుచోట్ల తాగునీరు, సరైన వసతి సదుపాయాలు కరువయ్యాయి. సోలార్ వాటర్ హీటర్లు మూలకు చేరడంతో విద్యార్థులకు చన్నీళ్లే దిక్కవుతున్నాయి. గిరిజన విద్యార్థుల సంక్షేమంపై టిడిపి కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

హుకుంపేట మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఇంగ్లీష్ మీడియం పాఠశాల (బాలురు-2)కు సొంత భవనం లేదు. ఇక్కడి విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలో ఆశ్రయమిచ్చారు. ఇక్కడ 320 మంది విద్యార్థులు ఉండగా, వారికి కేవలం నాలుగు గదులు మాత్రమే కేటాయించారు. వాటిలోనే పగటి పూట చదువులు సాగుతున్నాయి. రాత్రిపూట చాలీచాలని చోటులో విద్యార్థులు ఇరుక్కుని నిద్రపోతున్నారు. రాత్రిపూట తేళ్లు, పాములు వస్తున్నాయని చెబుతున్నారు. వంట గది, వసతి, తరగతులు అన్నీ ఒకే భవనంలో నడుస్తుండడంతో పరిశుభ్రత కరువైంది. 2018-19లో సర్వశిక్ష అభియాన్ నిధులతో కొత్త భవనం మంజూరైనప్పటికీ నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఇక్కడి విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. వర్షాకాలంలో ఈ ఇబ్బందులు మరింత పెరుగుతున్నాయని వార్డెన్ ప్రవీణ్ తేజ చెప్పారు. డుంబ్రిగుడ మండలం కించుమండ, కిల్లోగూడ, సొవ్వా, గుంటసీమ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు భోజనశాలలు లేక ఆరుబయట భోజనాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో తడుస్తూ ప్లేట్లలో భోజనాలు తీసుకొని వసతి గదుల వద్దకు వెళ్లి తింటున్నామని పలువురు విద్యార్థులు తెలిపారు. అరకులోయలోని ఆదిమ జాతి గిరిజన గురుకుల (పివిటిజి) వసతి గృహంలో 661 మంది ఆదిమ జాతి విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 56 మరుగుదొడ్లలో సగం నిరుపయోగంగా ఉన్నాయి. ఒక బ్లాక్‌లోని మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ లేదు. మరో బ్లాక్‌లోని మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. మరుగుదొడ్లు సరిపోక ఆరుబయట మలవిసర్జనకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. బెడ్లు ఉన్నప్పటికీ ఏర్పాటు చేయడానికి రూము సరిపోక ఒక్కొక్క మంచంపై ఇద్దరు నిద్రిస్తున్నారు. సరిపడా డార్మెటరీ నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు. తరగతి గదులు వర్షానికి కారుతున్నాయి. ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ కరువైంది.

గిరిజన వసతి గృహాల్లో ఆరేళ్లుగా సోలార్ వాటర్ హీటర్లు పనిచేయడం లేదు. ఆశ్రమ విద్యార్థుల స్నానాల కోసం వేడి నీళ్లు అందించడానికి వీటిని 2013-14లో సుమారు కోటిన్నర వ్యయంతో ఏర్పాటు చేశారు. మొత్తంగా పాడేరు ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ బాలికల, బాలుర ఆశ్రమ పాఠశాలల్లో సోలార్ వాటర్ హీటర్లు అమర్చేందుకు అవకాశం ఉన్న 87 ఆశ్రమ పాఠశాలలను ఎంపిక చేసి వాటిలో పెట్టారు. ఇవి మూడేళ్ల ముచ్చటగానే మారాయి. 2019 నాటికి పూర్తిగా మూలకు చేరాయి. నిర్వహణ లోపమే ఈ సోలార్ హీటర్ల వైఫల్యానికి కారణంగా తెలుస్తోంది. అవి అందుబాటులోలేక విద్యార్థులు గజగజ వణికించే చలిలో శీతాకాలం చన్నీళ్ల స్నానాలు చేసేందుకు వెనుకాడుతున్నారు. చర్మవ్యాధులకు గురవుతున్నారు. 'చన్నీళ్ల స్నానం చేయలేకపోతున్నాం. ఉదయాన్నే స్టడీ అవర్స్‌కు తరగతిలోకి వెళ్లడానికి వేకువ జామున స్నానాలు చేయాలి. ట్యాంకులో వాటర్ చాలా చల్లగా ఉంటోంది. రోజు విడిచి రోజు మధ్యాహ్నం, సాయంత్రం పూట స్నానాలు చేస్తున్నాం' అని లోచలిపుట్ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల విద్యార్థి చెప్పారు.

# ఉమ్మడి కృష్ణా జిల్లాపై మొంథా తుపాను ప్రభావం

## జోరు వానలు, ఈదురు గాలులతో నేలకొరిగిన పంటలు





**కృష్ణా జిల్లా, పతాకం న్యూస్:** మొంథా తుపాను ప్రభావం ఉమ్మడి కృష్ణా జిల్లాపై ప్రభావం చూపిస్తోంది. జోరు వానల ధాటికి పలు చోట్ల పంట పొలాలకు నష్టం వాటిల్లింది. ఈదురుగాలులూ ప్రభావం ఎక్కువగానే ఉంది. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పరిస్థితిని బట్టి పునరావాస కేంద్రాలకు తరలించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

మొంథా తుపాను ప్రభావంతో కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం వేకనూరులో భారీ ఈదురుగాలులకు పెద్ద చెట్టు విరిగి రోడ్డుపై పడింది. అవనిగడ్డ- నాగయలంక ప్రధాన రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెట్టు విరిగిపడిన సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వాహనాదారులు ముందుకొచ్చి స్వయంగా చెట్టును పక్కకు లాగే ప్రయత్నం చేశారు. తుపాను ప్రభావంతో జోరువాన, హోరుగాలులకు పంటలు దెబ్బతింటున్నాయని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోపిదేవి మండలంలో ఈదురు గాలులకు పంటలు నేలకొరిగాయి. కోసూరివారిపాలెం, మోపిదేవిలో అరటి, వరి నేలకొరిగాయని రైతులు వాపోయారు.

మొంథా తుపాను దృష్ట్యా విజయవాడ చిట్టినగర్‌లోని ప్రజలను పోలీసులు అప్రమత్తం చేశారు. కొండ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారికి కౌన్సిలింగ్ ఇచ్చేందుకు టూ టౌన్ సీఐ కొండలరావు బృందం పర్యటించింది. ప్రమాదకర పరిస్థితుల్లో ఉండొద్దని పునరావాస కేంద్రాలకు రావాలని మైక్ ద్వారా పోలీసు బృంద సభ్యులు ప్రచారం చేశారు. మొంథా తుపాను దృష్ట్యా పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉన్నట్లు విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు తెలిపారు. చిట్టినగర్ కొండ ప్రాంతాన్ని సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. నగరంలో ప్రమాదకరంగా ఉన్న హోర్డింగ్?లను ముందు జాగ్రత్త చర్యగా తొలగించినట్లు సీపీ రాజశేఖర్?బాబు ఈ సందర్భంగా వివరించారు.

తుపానును ఐక్యంగా ఎదుర్కొంటాం: అన్ని శాఖల సమన్వయంతో మొంథా తుపానును ఐక్యంగా ఎదుర్కొంటామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మచిలీపట్నంలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి కొల్లు ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసి పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. ప్రాణ నష్టం లేకుండా అన్నిరకాలైన చర్యలను చేపట్టామని వెల్లడించారు.

తుపాను పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులతో సమావేశం నిర్వహించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ప్రజలను అప్రమత్తం చేస్తూ అందుబాటులో ఉండాలని అధికారులకు పలు సూచనలు చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే విషయంలో నిర్లక్ష్యం వద్దని ఆయన పేర్కొన్నారు. పట్టణ, గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలియజేశారు.

మొంథా తుపాను ప్రభావంతో కృష్ణా జిల్లా గుడివాడలో అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమైంది. ప్రజలకు అత్యవసర సేవలను అందించేందుకు అవసరమైన యంత్రాలు, సహాయక పనిముట్లను సిద్ధం చేశారు. ఆస్కా లైటింగ్ యంత్రాన్ని అధికారులు పరీక్షించారు. తుపాన్?ను అన్ని విధాలా సమర్థంగా ఎదుర్కొనేందుకు గుడివాడలో 8 బృందాలను సిద్ధం చేశామని అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి ఆంజనేయులు తెలిపారు.

# 'దగ్గు'ను ఇంట్లోనే తగ్గించుకోవచ్చా? డాక్టర్ దగ్గరికి వెళ్లాలా?



దగ్గు చాలా చికాకు పెడుతుంది. ఇది పగలు పనులు చేసుకోనీయదు, రాత్రి సరిగా నిద్ర పట్టనీయదు. దీంతో దగ్గును తగ్గించుకోవటానికి చాలామంది పుదీనా బిళ్లలు చప్పరించటం, లవంగాలు నోట్లో వేసుకోవటం వంటి ఎన్నెన్నో చిట్కాలు పాటిస్తుంటారు. మరి కొందరైతే, గూగుల్, యూట్యూబ్, సోషల్ మీడియాలో ఉపశమన మార్గాలనూ వెతుకుతుంటారు. అయితే వీటి కన్నా ముందు దగ్గు తడిదా? పొడిదా? అనేది గుర్తించాలంటున్నారు నిపుణులు. ఎందుకంటే, అన్ని దగ్గులూ ఒకటి కావని చెబుతున్నారు. మరి, ఎలా గుర్తించాలో ఇప్పుడు తెలుసుకుందాం!

తడి, పొడి దగ్గు రకాలు శరీరంలో ఏం జరుగుతుందో అనే దానికి సంబంధించిన ముఖ్యమైన సూచనలు ఇస్తుంటాయని నిపుణులు చెబుతున్నారు. దీన్ని ఇంట్లోనే తగ్గించుకోవచ్చా? డాక్టర్ దగ్గరికి వెళ్లాలా? అనేవీ తెలియజేస్తాయని అంటున్నారు. ఈ క్రమంలో తడి, పొడి దగ్గు మధ్య తేడా ఏంటీ? పొడి దగ్గులో కళ్లె పడదని, గొంతులో ఏదో దురద పెడుతున్నట్టు అనిపిస్తుంటుందని వివరిస్తున్నారు. అదే తడి దగ్గులోనైతే కళ్లె పడుతుందని తెలియజేస్తున్నారు.

కారణాలు వేర్వేరే : పొడి దగ్గు చాలా వరకూ గొంతులో దురద, వాపు మూలంగా వస్తుందని నిపుణులు చెబుతున్నారు. అదే తడి దగ్గు అయితే ఇన్?ఫెక్షన్?తో పుట్టుకొచ్చిన కళ్లె వంటి వాటిని శరీరం బయటకు తోసే ప్రయత్నం చేస్తోందని అంటున్నారు. వీటిని రకరకాల అంశాలు ప్రేరేపిస్తుంటాయని వివరిస్తున్నారు.

పొడి దగ్గు ప్రేరకాలు : పొడి దగ్గు అంటే శ్లేష్మం ఉత్పత్తి చేయని దగ్గు అని, అలెర్జీలు, ఉబ్బసం, యాసిడ్ రిఫ్లక్స్, బ్రోన్కైటిస్ సాధారణ కారకాలుగా ఉన్నాయని పేర్కొంది.

తడి దగ్గు ప్రేరకాలు : బ్రాంకైటిస్, జలుబు, ఫ్లూ, సీవోపీడీ, కొవిడ్-19, న్యుమోనియా లాంటివి కారకాలుగా నిపుణులు చెబుతున్నారు. అయితే, కొన్ని దగ్గులు ఒకరకంగా మొదలై మరో రకంగానూ మారొచ్చని అంటున్నారు. ఎలాగంటే, జలుబు అనేది తడి దగ్గుతో మొదలవుతుందని, వైరస్?తో పోరాడటానికి శరీరం ఎక్కువగా కళ్లెను ఉత్పత్తి చేస్తుందని చెబుతున్నారు. దీన్ని ఊపిరితిత్తులు దగ్గు రూపంలో బయటకు వెళ్లగొడుతుంటాయని, జలుబు లక్షణాలు తగ్గిన తర్వాత దగ్గు ఉండొచ్చని వివరిస్తున్నారు. కాకపోతే అదప్పుడు పొడిగా మారుతుందని పేర్కొంటున్నారు. ఈ సమస్య కొద్ది రోజులు, నెలల వరకూ వేధించొచ్చని తెలియజేస్తున్నారు. అలాగే, ఇన్?ఫెక్షన్ తగ్గిన తర్వాత వాపు మూలంగానూ శ్వాస మార్గాలు చికాకుకు గురై పొడి దగ్గు రావొచ్చని సూచిస్తున్నారు.

ఏం చేయాలి? : దగ్గు ఏ రకమో తెలుసుకుంటే సరైన చికిత్సకు వీలుంటుందని నిపుణులు చెబుతున్నారు. తడి దగ్గు అనేది కళ్లె ద్వారా సూక్ష్మక్రిములను బయటకు నెట్టేస్తుందంటున్నారు. అదే పొడి దగ్గు అయితే శ్వాసమార్గాలకు ఉపశమనం అవసరమని వివరిస్తున్నారు. ఏ రకమైన దగ్గు అయినా తగ్గటానికి కొన్ని చిట్కాలు మేలు చేస్తాయని సూచిస్తున్నారు. ఇవి శ్వాసమార్గాల్లో చికాకు తగ్గటానికి, కళ్లె తేలికగా బయటకు రావటానికి తోడ్పడతాయని సలహా ఇస్తున్నారు. టీ, నిమ్మకాయ రసం కలిపిన గోరు వెచ్చటి నీరు తాగటం. గొంతులో చికాకు తగ్గటానికి చెంచాడు తేనె తీసుకోవచ్చు. కాస్త ఎక్కువ నీరు తాగటం, తగినంత విశ్రాంతి తీసుకోవటమూ మేలని అధ్యయనం పేర్కొంది.

ఇలాంటి చిట్కాలేవీ పనిచేయకపోతే మందులు అవసరమవుతాయని నిపుణులు సూచిస్తున్నారు. పొడి దగ్గుకు, దగ్గును అణచిపెట్టే మందులు మేలు చేస్తాయని, ఇవి గొంతు, శ్వాసనాళం, ఊపిరితిత్తులను చికాకు పెట్టే దుమ్ము, సూక్ష్మక్రిములు వంటి వాటిని తొలగించటం ద్వారా ఉపశమనం కలిగిస్తాయని అంటున్నారు. తడి దగ్గుకైతే కళ్లె తేలికగా బయటకు వెళ్లగొట్టే సిరప్?లు(ఎక్స్?ఎక్టోరేంట్) ఉపయోగపడతాయని చెబుతున్నారు. ఈ క్రమంలో దగ్గు మందులు పెద్ద పిల్లలకు, పెద్దవారికి మాత్రమేనని గుర్తించుకోవాలని పేర్కొంటున్నారు. సాధారణంగా నాలుగేళ్లలోపు పిల్లలకు దగ్గు, జలుబు మందులు ఇవ్వరని, ఒకవేళ పిల్లలు దగ్గుతో బాధపడుతుంటే వెంటనే డాక్టర్?ను సంప్రదించి, సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు.

డాక్టర్ దగ్గరికి ఎప్పుడు : ఇబ్బంది, చికాకు పెట్టినా కూడా దగ్గు ఒకరకంగా రక్షణ చర్యే అని నిపుణులు అంటున్నారు. అన్ని సమయాల్లోనూ దీన్ని అణచివేయటం సమంజసం కాదని, కొన్ని దగ్గులు క్షయ వంటి జబ్బులకు సంకేతం కావొచ్చని హెచ్చరిస్తున్నారు. తీవ్రమైన దగ్గును ఏకపక్షంగా గరిష్టంగా 3 వారాల పాటు ఉంటే దగ్గుగా సూచిస్తారని, చాలా మంది రోగులలో, ఇది ఎగువ శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు (%ఖ=ు×%), తీవ్రమైన బ్రోన్కైటిస్ లేదా బాక్టీరియల్ లేదా తరచుగా వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల కలిగే ట్రాకియో-బ్రోన్కైటిస్ వల్ల వస్తుందని అధ్యయనం పేర్కొంది. ప్రేరిత దగ్గు ఉన్న కొద్ది మంది రోగులు మాత్రమే వైద్య సహాయం అవసరమని సూచిస్తుంది.ఖంగుఖంగుమని మోగుతూ దగ్గుతున్నా దగ్గులో రక్తం, కళ్లె పడుతున్నా..శ్వాస తీసుకోవటం కష్టమవుతున్నా, ఆయాసం వస్తున్నా మూడు వారాలు దాటినా దగ్గు తగ్గకపోయినాజ్వరం, ఛాతీనొప్పి వంటి ఇతర ఇబ్బందికర లక్షణాలు కనిపిస్తున్నా - వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. దగ్గుకు కారణమేంటో తెలుసుకొని, తగు చికిత్స తీసుకోవాలని సలహా ఇస్తున్నారు.

# ముల్తానీ మట్టితో ప్రయోజనాలెన్నో?

ముల్తానీ మట్టి.. అందం కోసం పరితపించేవారికి దీని గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. చర్మానికి మేలు చేసే ఈ మట్టి లేనిదే బ్యూటీ ప్రొడక్ట్లే లేవు. ఎలాంటి రసాయనాలు లేని ఈ స్వచ్ఛమైన మట్టిలో ఉండే సహజ ఖనిజాలే.. చర్మానికి రక్షణ కలిగిస్తాయి. కాసుల వర్షం కురిపిస్తున్న ఈ మట్టి ఎక్కడ లభిస్తుందో తెలుసా?

ఇలాంటి మట్టి ప్రపంచంలో చాలా ప్రాంతాల్లో లభిస్తుంది. అయితే, పాకిస్థాన్‌లోని ముల్తాన్‌లో ఉండే మట్టి మాత్రమే మేలైనదని భావిస్తున్నారు. అందుకే, ఎక్కువ మంది ముల్తాన్‌లో లభించే మట్టిని సేకరించేందుకు ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు. అందుకే ఈ మట్టిని 'ముల్తానీ మిట్టీ లేదా ముల్తానీ మట్టి' అని పిలుస్తారు. అయితే, ఈ మట్టి వల్ల చర్మానికి ఎలాంటి సమస్య ఉండదు. బ్రాండెడ్ సంస్థలు విక్రయించే మట్టిని కొనడమే మేలు.

ముల్తానీ మట్టిలో మెగ్నీషియం, క్వార్ట్జ్, సిలికా, ఇనుము, కాల్షియం, కాల్సైట్, డోలమ్కైట్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ మట్టి ఎక్కువగా పౌడర్ రూపంలోనే లభిస్తుంది. తెలుగు, నీలం, ఆకుపచ్చ, గోదుమ రంగుల్లో ఎక్కువగా లభిస్తుంది. చర్మం, జుట్టు సంబంధిత సమస్యలతో బాధపడేవారికి ముల్తానీ మట్టి ఒక వరం. మరి, ఈ మట్టి వల్ల ఎన్ని రకాల ప్రయోజనాలు ఉన్నాయో చూసేద్దామా!

జిడ్డును గ్రహిస్తుంది: సాధారణంగా మట్టికి పీల్చే గుణం ఎక్కువ. అందుకే, ముల్తానీ మట్టిని ముఖానికి రాయగానే ముందుగానే చర్మాన్ని జిడ్డులా మార్చే నూనెలను పీల్చేస్తుంది. చర్మ రంధ్రాల్లో క్లాగ్ లేకుండా చూస్తుంది. చర్మం పీహెచ్ (%జూ=%) స్థాయిలను సమతుల్యం చేస్తుంది. అందుకే, ఎక్కువ మంది దీన్ని ఫేస్‌ప్యాక్‌గా వినియోగిస్తారు. చర్మంపై మచ్చలను తొలగించేందుకు ఇది మంచి ఔషదం.

మొటిమలు మటుమాయం: మొటిమలను తొలగించడంలో ముల్తానీ మట్టి బాగా ఉపయోగపడుతుంది. చర్మంపై జిడ్డుగారే నూనెల వల్ల మొటిమలు ఏర్పడతాయనే సంగతి తెలిసిందే. ముల్తానీ మట్టిని ముఖానికి రాసినట్లయితే జిడ్డు మాయమవుతుంది. అలాగే, మొటిమల వల్ల ముఖంపై ఏర్పడు గుంటలను కూడా తొలగిస్తుంది. చర్మాన్ని మృదువుగా ఉంచుతుంది.

చర్మానికి మంచి రంగు ఇస్తుంది: మీ మేను మెరవాలంటే.. ముల్తానీ మట్టిని రాయాల్సిందే. దీన్ని మీ చర్మానికి పూసుకోవడం ద్వారా రంగు మారుతుంది. డార్క్ స్కిన్‌తో బాధపడేవారికి ఇది ఉపయోగపడుతుంది. మరీ తెల్లగా మార్చుకున్నా.. చర్మాన్ని కాంతివంతంగా కనిపించేందుకు సహకరిస్తుంది. చర్మంపై ఉండే మృత కణాలను తొలగిస్తుంది.

చుండ్రు నుంచి ఉపశమనం: చుండ్రు సమస్యతో బాధపడుతున్నట్లయితే ముల్తానీ మట్టిని ట్రై చేయండి. చుండ్రుకు కారణమయ్యే గ్రీజు, దూళిని ఈ మట్టి గ్రహిస్తుంది. తల చర్మంలోని రక్త ప్రసరణ మెరుగుపరుస్తుంది. 20 నిమిషాల తర్వాత మట్టిని షాంపూతో శుభ్రం చేయాలి. ఆ తర్వాత కండీషనర్ రాసుకోవాలి. దీనివల్ల జుట్టు చిట్లకుండా ఆరోగ్యకరంగా ఉంటుంది.





# కార్పొరేట్ రంగంలో నిశ్శబ్ద విపత్తు

- విరామం లేని పని గంటలు
- ఒత్తిడి, అలసటతో ఉద్యోగులు సతమతం
- మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్న వైనం



**అమరావతి, పతాకం న్యూస్:** భారత కార్పొరేట్ రంగం ఇప్పుడు ఓ నిశ్శబ్ద విపత్తును ఎదుర్కొంటోంది. విపరీతమైన ఒత్తిడి, ఎంత చేసినా తరగని పని కారణంగా ఉద్యోగులు శారీరకంగా, మానసికంగా అలసటకు గురవుతున్నారు. ఇదో వృత్తిపరమైన సిండ్రోమ్ అని సాక్షాత్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థే చెబుతోంది. ఉద్యోగులకు విధి నిర్వహణ వ్యసనంగా మారిపోతోంది. వారు అందులోనే కూరుకుపోయి బయటికి రాలేకపోతున్నారు. పని ప్రదేశంలో తక్షణమే వ్యవస్థాగతమైన సంస్కరణలు చేపట్టని పక్షంలో పరిస్థితి దారుణంగా తయారవుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరించారు.

ఆవిష్కరణలకు, ఆర్థిక వృద్ధికి ఎంతగానో దోహదపడుతున్న మన కార్పొరేట్ రంగంలో ఇప్పుడు అలసట, ఆందోళన, ఉత్ప్రేరకాలపై మౌనంగా ఆధారపడడం కన్పిస్తున్నాయి. కార్పొరేట్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి ఆందోళనకర స్థాయిలో ఉన్నదని నిపుణులు చెబుతున్నారు. ఉద్యోగుల మానసిక ఆరోగ్యం దెబ్బతింటోందని, వారు మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారని ముంబయిలోని సమర్పణ్ మెంటల్ హెల్త్ సంస్థకు చెందిన కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ భక్తి జోషి ఆందోళన వ్యక్తం చేశారు. విరామం లేకుండా పని చేయడం, వృత్తిపరమైన పోటీ కారణంగా ఉద్యోగులు 'రెడ్ జోన్'లోకి వెళ్లిపోతున్నారని ఆమె తెలిపారు.

మన దేశంలో పనిచేసే వయసున్న వారిలో సుమారు 60 శాతం మంది దీర్ఘకాలిక అలసట, అధిక పనిగంటలు, ఉద్యోగ అభద్రత వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. విరామం అనేదే లేకుండా నిరంతరం పనిచేస్తుంటే తమలో వృత్తిపరమైన నైపుణ్యం తగ్గుతోందేమోనన్న అభిప్రాయం కూడా వారిలో కలుగుతోంది. ఐటీ, ఫైనాన్స్, కన్సల్టింగ్, మార్కెటింగ్ వంటి రంగాలలో ఉన్న వారు రోజుకు 14 గంటల వరకూ పని చేస్తుంటారు. ఆ ఒత్తిడిని తట్టుకోవడానికి వారు ఆల్కహాల్, నికోటిన్, నిద్ర మాత్రలకు అలవాటు పడుతున్నారు. ఎగ్జిక్యూటివ్‌లు గతంలో అప్పుడప్పుడూ మాదక ద్రవ్యాలు తీసుకునే వారు. కానీ ఇప్పుడది సర్వసాధారణమై పోయింది. ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి నుంచి దూరం కావడానికి మద్యం, సిగరెట్లు, ఉత్ప్రేరకాలు%ా%చివరికి ఓవర్-ది-కౌంటర్ మందులు కూడా తీసుకుంటున్నారు. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ 2019లో ఇచ్చిన ఓ నివేదిక ప్రకారం దేశంలోని పురుషుల్లో మద్యపానం 27.3 శాతం ఉండగా మహిళల్లో 1.6 శాతంగా ఉంది. అయితే ఇది పెరుగుతోంది. ముఖ్యంగా పట్టణాల్లో పని చేస్తున్న వృత్తి నిపుణుల్లో మరింత ఎక్కువవుతోంది.

కార్పొరేట్ రంగంలో సమావేశాలు జరిగేటప్పుడు మద్యం సేవించడం షరా మామూలుగా మారింది. ఉద్యోగులు, అధికారుల మధ్య జరిగే చర్చల సందర్భంగా భావోద్వేగాలకు సంబంధించిన వ్యక్తిగత అంశాల ప్రస్తావనే ఉండదు. ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్ నివేదిక ప్రకారం దేశంలోని పెద్దల్లో సుమారు 10.6 శాతం మంది మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారు. వీరిలో 70 నుంచి 92 శాతం మందికి తగిన చికిత్స అందడం లేదు. కోవిడ్-19 తర్వాత నిశ్శబ్ద సంక్షోభం మరింత తీవ్రమైంది. ఇంటి నుంచే పని చేసే అవకాశం దక్కిన ఉద్యోగుల పరిస్థితి దారుణంగా తయారైంది. కార్యాలయ, వ్యక్తిగత స్పేస్ మధ్య సరిహద్దులు చెరిగిపోయాయి. ఫలితంగా పనిగంటలు బాగా పెరిగాయి. దానితో పాటే భావోద్వేగ ఒత్తిడి కూడా పెరిగింది. మహిళా ఉద్యోగుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది.

## ఒడిషా, రాజస్థాన్‌లోనూ భారీ వర్షాలు



**భువనేశ్వర్ :** మొంథా తుపాను ప్రభావంతో ఒడిషా, రాజస్తాన్‌లోనూ భారీ వర్షాలు కురిసాయి. ముఖ్యంగా ఒడిషాలోని తీర, దక్షిణ భాగానికి చెందిన 15 జిల్లాలు తుపాను ప్రభావానికి గురయ్యాయి. భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడ్డం, ఇళ్లు ధ్వంసమవ్వడం, చెట్లు కూలడం వంటి ఘటనలతో సాధారణ జనజీవనం స్తంభించింది. మల్కాన్‌గిరి, కొరాపుట్, గజపతి, గంజాం, కంధమాల్, కలహండి, నబరంగ్‌పూర్ జిల్లాలో భారీ వర్షాలు కురిసాయి. గజపతి జిల్లాలో అనక గ్రామ పంచాయతీ పరిధిలోని రహదారిపై కొండచరియలు విరిగపడడంతో ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే ఇదే జిల్లాలో కాశీనగర్ బ్లాక్‌లోని పర్టోడ పంచాయతీ వద్ద లింగ-బరభ రహదారిపైనా కొండచరియలు విరిగిపడ్డాయి. తుపాను ప్రభావంతో రాజస్తాన్‌లోని బుండి జిల్లాలో నైన్వా వద్ద 24 గంటల వ్యవధిలో 130 మీమీ వర్షపాతం నమోదయింది. ఉదయపూర్, కొటా జిల్లాలోనూ భారీ వర్షాలు కురిసాయి. తుపాను ప్రభావంతో కేరళలోని ఎనిమిది జిల్లాలో బుధవారం భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతవరణ శాఖ హెచ్చరించింది. తిరువనంతపురం, కొల్లాం, పథనంథిట్ట, అలప్పుజ, కొట్టాయం, ఇడుక్కి, ఎర్నా కుళం, త్రిస్సూర్ జిల్లాలకు ఎల్లో అలెర్టు జారీ చేసింది.

మొంథా తుపాను నేపథ్యంలో మొబైల్ ఫోన్లకు నేరుగా రియల్ టైమ్ హెచ్చరికలను జారీ చేయడాన్ని జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్‌డిఎంఎ) ప్రారంభిం చింది. ఆంధ్రప్రదేశ్, ఒడిషా వ్యాప్తంగా మంగళవారం ఇలాంటి హెచ్చరికలను జారీ చేసింది.

మొంథా తుపాను నేపథ్యంలో రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. తుపాను హెచ్చరికలను అంచనా వేస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారుల్ని మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు డివిజన్లలోవార్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని, అవసరమైన సామాగ్రి, యంత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.




## కెరీర్ లో తొలిసారిగా..

# వన్డేల్లో నెంబర్ వన్ బ్యాటర్‌గా రోహిత్ శర్మ



భారత ఓపెనర్ రోహిత్ శర్మ తన కెరీర్‌లో తొలిసారిగా వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని చేరుకున్నాడు. 38 ఏళ్ల వయసులో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో నెంబర్ 1 స్థానాన్ని దక్కించుకున్నాడు. సిడ్నీలో భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన మూడో/చివరి వన్డేలో సెంచరీ చేసిన రోహిత్ శర్మ రెండు స్థానాలు ఎగబాకి అగ్రస్థానానికి చేరుకున్నాడు. మూడు వన్డేల సిరీస్‌లో ఒక సెంచరీ, హాఫ్ సెంచరీ చేసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు సొంతం చేసుకున్నాడు. ఆ సిరీస్‌లో రోహిత్ శర్మ ప్రదర్శనకు ఐసీసీ ర్యాంకుల్లో ఫలితం కనిపించింది. ఇప్పటి వరకు నెంబర్ వన్‌గా ఉన్న శుభ్‌మన్ గిల్ రెండు స్థానాలు దిగజారి మూడోస్థానానికి పడిపోయాడు. గత దశాబ్ద కాలంలో ఎక్కువ కాలం రోహిత్ శర్మ టాప్ 10లో నిలిచాడు.

ప్రస్తుతం రోహిత్ శర్మ 781 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, ఆఫ్ఘనిస్థాన్ ఆటగాడు ఇబ్రహీం జాద్రాన్ 764 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. శుభ్‌మన్ గిల్ (745 పాయింట్లు), బాబర్ అజామ్ (739), విరాట్ కోహ్లీ (725) వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో కొనసాగుతున్నారు. మూడో వన్డేలో విరాట్ కోహ్లీ అర్ధ సెంచరీ చేసినప్పటికీ, అంతకుముందు రెండు మ్యాచ్‌లలో డకౌట్ అయ్యాడు. ఈ కారణంగా అతను ఒక స్థానం పడిపోయాడని క్రీడా విశ్లేషకులు చెబుతున్నారు. శ్రేయస్ అయ్యర్ (700) టాప్ 10లో కొనసాగుతున్నాడు. ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ (589) ఏకంగా 23 పాయింట్లు మెరుగుపర్చుకుని 25వ ర్యాంకుకు చేరుకున్నాడు.

వన్డే బౌలింగ్‌లో అక్షర్ పటేల్ ఆరు స్థానాలు ఎగబాకి 31వ స్థానానికి చేరుకున్నాడు. టాప్ 10లో కుల్దీప్ యాదవ్ (634) మాత్రమే ఉన్నాడు. ఒక స్థానం దిగజారి 7వ స్థానానికి పడిపోయాడు. ఆస్ట్రేలియా పేసర్ జోష్ హేజిల్‌వుడ్ రెండు స్థానాలు ఎగబాకి 8వ ర్యాంకుకు చేరుకున్నాడు. ఆఫ్ఘన్ ఆటగాడు రషీద్ ఖాన్ (710) బౌలింగ్ విభాగంలో మొదటి స్థానంలో కొనసాగుతున్నాడు.

## భారత్-ఆస్ట్రేలియా తొలి టీ20 వర్షం కారణంగా రద్దు



భారత్, ఆస్ట్రేలియా మధ్య కాన్‌బెర్రాలోని మనుకా ఓవల్ వేదికగా జరగాల్సిన తొలి టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. హోరాహోరీగా సాగుతుందనుకున్న ఈ మ్యాచ్‌కు వరుణుడు అడ్డంకిగా మారాడు. ఆట నిలిచిపోయే సమయానికి భారత జట్టు పటిష్ట స్థితిలో ఉండటంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా కెప్టెన్ మొదట ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. దీంతో బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఓపెనర్ అభిషేక్ శర్మ (14 బంతుల్లో 19) వేగవంతమైన ఆరంభాన్నిచ్చాడు. నాలుగు ఫోర్లతో దూకుడుగా ఆడిన అతను నాథన్ ఎల్లిస్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, మరో ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. వీరిద్దరూ ఆసీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. కేవలం 35 బంతుల్లోనే 62 పరుగుల అద్భుత భాగస్వామ్యం నెలకొల్పారు. భారత ఇన్నింగ్స్ 9.4 ఓవర్ల వద్ద ఉండగా, స్కోరు 97/1 వద్ద వర్షం మొదలైంది. ఆ సమయంలో గిల్ (20 బంతుల్లో 37), సూర్యకుమార్ యాదవ్ (24 బంతుల్లో 39) క్రీజులో ఉన్నారు.వర్షం ఎంతకీ తగ్గకపోవడంతో, మైదానాన్ని పలుమార్లు పరిశీలించిన అంపైర్లు.. ఆటను కొనసాగించే పరిస్థితి లేదని నిర్ధారించి మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి మ్యాచ్ ఫలితం తేలకుండానే ముగిసింది.




# అడివి శేష్ 'డెకాయిట్' వాయిదా

## 2026 మార్చి 19న కొత్త రిలీజ్ డేట్ ఖరారు



యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'డెకాయిట్' విడుదల తేదీలో కీలక మార్పు చోటుచేసుకుంది. ముందుగా ఈ చిత్రాన్ని ఈ ఏడాది డిసెంబర్ 25న విడుదల చేయనున్నట్లు ప్రకటించినా, తాజాగా తేదీని మార్పు చేస్తూ చిత్రబృందం కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. సినిమాను 2026 మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు అధికారికంగా ప్రకటించింది.

ఈ కొత్త విడుదల తేదీని అడివి శేష్ తన ఎక్స్ ఖాతా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. "ఈసారి మామూలుగా ఉండదు. వెనక్కి తగ్గేదే లేదు. చ%ణూాజూ×ు% ఈ ఉగాదికి 2026 మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వస్తుంది" అని పోస్ట్ చేశారు. ఉగాది, ఈద్ పండగల సందర్భంగా వస్తున్న లాంగ్ వీకెండ్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ తేదీని ఖరారు చేశారు. కాగా, ఓ యాక్షన్ సన్నివేశం చిత్రీక రిస్తుండగా అడివి శేష్ గాయపడటంతోనే సినిమా విడుదల వాయిదా పడిందని కొన్ని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

"డెకాయిట్" చిత్రంలో ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ ఓ శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. వీరితో పాటు ప్రకాశ్ రాజ్, సునీల్, అతుల్ కులకర్ణి, జైన్ మేరీ ఖాన్, కామాక్షి భాస్కర్ల వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

తనను మోసం చేసిన మాజీ ప్రియురాలిపై కోపంతో రగిలిపోతూ, పగ తీర్చుకోవాలనుకునే ఓ ఖైదీ ప్రయాణమే ఈ చిత్ర కథాంశం. ప్రేమ, ద్రోహం, ప్రతీకారం వంటి అంశాలతో ఈ కథ ఉద్వేగభరితంగా సాగనుంది. ఈ చిత్రం ద్వారా షానియల్ డియో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. అడివి శేష్, షానియల్ డియో కలిసి ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే అందించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం తదుపరి షెడ్యూల్‌ను మహారాష్ట్రలో ప్లాన్ చేశారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియా యార్లగడ్డ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

# చిత్ర పరిశ్రమలో పనివేళలపై రష్మిక కీలక వ్యాఖ్యలు



చిత్ర పరిశ్రమలో పనివేళలపై కొంతకాలంగా జరుగుతున్న చర్చపై స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న స్పందించారు. ఎక్కువ గంటలు పనిచేయడం ఆరోగ్యానికి మంచిది కాదని, పరిశ్రమలో నటీనటుల నుంచి లైట్‌మ్యాన్ వరకు ప్రతి ఒక్కరికీ నిర్ణీత పనివేళలు ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు. తన కొత్త చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్' ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

ఈ సందర్భంగా రష్మిక మాట్లాడుతూ.. "ఒక రోజులో నిర్ణీత సమయానికి మించి పనిచేయడం సరైంది కాదు. వ్యక్తిగతంగా నేను చాలా ఎక్కువ గంటలు పనిచేస్తాను. కంటి నిండా నిద్రపోయి చాలా నెలలు గడిచింది. కానీ, మీరు అలా చేయకండి. వీలైతే రోజుకు 9 నుంచి 10 గంటలపాటు నిద్రపోండి. సౌకర్యవంతమైన షెడ్యూల్ ప్లాన్ చేసుకోవడం భవిష్యత్తులో మనకు ఎంతో మేలు చేస్తుంది" అని తోటి నటీనటులకు సలహా ఇచ్చారు.

"సినిమా పరిశ్రమలో కూడా నిర్దిష్టమైన పనివేళలు ఉండాలని నేను బలంగా కోరుకుంటున్నాను. ఇది కేవలం నటులకు మాత్రమే కాదు, దర్శకుల నుంచి సాంకేతిక సిబ్బంది వరకు అందరికీ వర్తించాలి. దానివల్ల ప్రతి ఒక్కరూ తమ కుటుంబంతో గడిపేందుకు సమయం దొరుకుతుంది. నేను కూడా నా కుటుంబంపై మరింత దృష్టి పెట్టాలనుకుంటున్నాను. భవిష్యత్తు గురించే నా ఆలోచనలన్నీ. రేపు నేను తల్లి అయ్యాక పరిస్థితి ఎలా ఉంటుందో కూడా ఇప్పటి నుంచే హించుకుంటున్నాను" అని రష్మిక పేర్కొన్నారు.

కాగా, 8 గంటల పనివేళలు డిమాండ్ చేయడం వల్లే ప్రభాస్ 'స్పిరిట్' సినిమా నుంచి దీపికా పదుకొణె తప్పుకున్నారని ఇటీవల ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో రష్మిక వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రష్మిక ప్రధాన పాత్రలో నటించిన 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రంలో దీక్షిత్ శెట్టి, అనూ ఇమ్మాన్యుయేల్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా నవంబరు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.






# చిరుతో సినిమా నా కల

## మాళవిక మోహనన్



మెగాస్టార్ చిరంజీవి, డైరెక్టర్ బాబీ కాంబినేషన్‌లో రాబోతున్న 'మెగా 158' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నట్లు వస్తున్న వార్తలపై నటి మాళవిక మోహనన్ స్పష్టత ఇచ్చారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, అవన్నీ వదంతులేనని ఆమె తేల్చిచెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియా ద్వారా ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.

"మెగా 158 చిత్రంలో నేను నటిస్తున్నట్లు ఆన్‌లైన్‌లో ప్రచారం జరుగుతోంది. ఐకానిక్ స్టార్ చిరంజీవి గారితో ఏదో ఒక రోజు స్క్రీన్ పంచుకోవాలనే కోరిక నాకు బలంగా ఉంది. కానీ, ప్రస్తుతానికి నేను ఆ ప్రాజెక్ట్‌లో భాగం కావడం లేదు. దయచేసి ఆ వదంతులను నమ్మవద్దు" అని మాళవిక తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆమె ప్రకటనతో చిరంజీవి సరసన నటించబోయే హీరోయిన్‌పై గత కొద్ది రోజులుగా సాగుతున్న ఊహాగానాలకు తెరపడినట్లయింది. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో 'మెగా 158'పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది. మాళవిక స్పష్టత ఇవ్వడంతో ఈ చిత్రంలో నటించబోయే అసలు కథానాయిక ఎవరనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. దీనిపై చిత్ర బృందం త్వరలోనే అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**